
TITLE CODE: APTEL16281
తెలుగు దినపత్రిక
# పీపుల్స్ మోటివేషన్
People's Motivation
ఆంధ్రప్రదేశ్ / తెలంగాణ
సంపుటి : 01 | సంచిక : 122 | ఎడిటర్ : ఎం. రమేష్ | మంగళవారం, ఏప్రిల్ 2, 2024 | పేజీలు : 08 | వెల రూ. 5.00/-

## తెలుగు రాష్ట్రాల్లో.. ఎండల తీవ్రత



**నిప్పుల కుంపటిగా మారడంలో బెంబేలు**
**మరో రెండుమూడు రోజులు ఇదే పరిస్థితి**

తెలుగు రాష్ట్రాల్లో ఎండల తీవ్రత కొరసాగుతోంది. ఎండలు తీవ్రరూపం దాల్చడంతో జనం బెంబేలెత్తుతున్నారు. ఉదయం 12 గంటలు దాటితే ఎండలు నిప్పల కుంపటిని తలపిస్తున్నాయి. మరో మూడు రోజులు రికార్డు స్థాయిలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు అంటున్నారు. రాగల మూడు రోజులు సాదారణం కంటే 2 నుంచి 4 డిగ్రీల వరకు అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని హెచ్చరించారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల జిల్లాల్లో అత్యధిక ఉష్ణోగ్రతులు నమోదు అయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిం చారు.రాష్ట్రంలో ఎండలు తీవ్రమవుతున్నాయి. ఉదయం నుంచే వేడిగాలులు వీస్తున్నాయి. దక్షిణ తెలంగాణలో సాధారణం కంటే ఎక్కువగా వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నదని హెచ్చరించింది. రాష్ట్రంలో ఎండలు తీవ్రమై గాలిలో తేమతగ్గిందని వాతావరణ కేంద్రం తెలిపింది. గాలిలో తేమ శాతం తగ్గడంతో పొడిగాలులు వీస్తున్నాయని వివరించింది. ఈ నెలలో ఎండలు అధికంగానే ఉంటాయని, తెలిపింది.

- హైదరాబాద్/విజయవాడ, పీపుల్స్ మోటివేషన్

## పెన్షన్ల పంపిణీలో.. వైకాపా రాజకీయం

- మండిపడ్డ పిసిసి చీఫ్ షర్మిల

**న్యూఢిల్లీ, ఏప్రిల్1(పీపుల్స్ మోటివేషన్):**

పింఛన్లు పంపిణీ చేయకుండా వైకాపా ప్రభుత్వం కావాలనే జాప్యం చేస్తోందని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. రాజకీయ లబ్ధికోసమే ఇలా చేస్తున్నారని మండిపడ్డారు. వీరి రాజకీయం కోసం సామాన్యులు ఇబ్బందులు పడ్డా ఫర్వా లేదన్నారు. పెన్షన్ల పంపిణీకి రాష్ట్రంలో ఉద్యోగులు లేరా అని నిలదీశారు. దిల్లీలో మీడియాతో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం తీరును తప్పుపట్టారు. పింఛన్ల పంపిణీ ఆలస్యం చేసేందుకు కుట్ర చేస్తున్నారు. ఈ విషయంపై సీఎస్‌తో మాట్లాడాను. 3వ తేదీ నుంచి వారం పాటు పెన్షన్లు ఇస్తామని చెప్పారు. లబ్దిదారులు పింఛను అందుకునేందుకు 10 రోజులు నిరీక్షించాలా అన్నారు.



డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ డీబీటీ ద్వారా ఇవ్వాలని ఈసీ ఆదేశాలిస్తే ఎందుకు అమలు చేయడం లేదన్నారు. డీబీటీ ద్వారా వెంటనే పింఛన్లను పంపిణీ చేయాలి. లేకపోతే కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఎక్కడికక్కడ ఆందోళనలు చేపడతాం అని షర్మిల హెచ్చరించారు.

## విలేఖరులు కావలెను


అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ.. ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా..? బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా..? అయితే రండి... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

పీపుల్స్ మోటివేషన్ తెలుగు దినపత్రికలో

నియోజకవర్గ ఇంచార్జ్‌లు మండల రిపోర్టర్‌లు కావలెను..

సంప్ర : 80086 22746

## రాజకీయ స్వార్థం కోసం పెన్షనర్ల పొట్టకొట్టారు



- సొంత మనుషులకు నిధులన్నీ కట్టబెట్టిన జగన్
- ఎన్నికల ముందు ఖజానా ఖాళీచేసి వెళ్లిన జగన్
- టిడిపి నేతలు క్షేత్రస్థాయిలో సమస్యను పరిష్కరించాలి
- బూత్‌లెవల్ కార్యకర్తలతో చంద్రబాబు టెలీ కాన్ఫరెన్స్

2

## కేజ్రీవాల్‌కు 15 రోజుల జ్యుడిషియల్ కస్టడీ విధింపు

**లిక్కర్ కేసులో తీహార్ జైలుకు తరలింపు**

**న్యూఢిల్లీ, ఏప్రిల్1(పీపుల్స్ మోటివేషన్):**

మద్యం విధానానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో దిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ కస్టడీని కోర్టు మరోసారి పొడిగించింది. ఈ కేసులో 15 రోజుల జ్యుడిషియల్ కస్టడీ విధిస్తూ రౌజ్ అవెన్యూ కోర్టు సోమవారం ఉత్తర్వులిచ్చింది. దీంతో ఆయనను తిహార్ జైలుకు తరలించారు. ఈ కేసులో మార్చి 21న కేజ్రీవాల్‌ను ఈడీ అధికారులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అనంతరం కోర్టులో హాజరుపర్చగా.. తొలుత ఏడు రోజులు, ఆ తర్వాత నాలుగు రోజుల పాటు ఈడీ కస్టడీకి న్యాయస్థానం అప్పగించింది. సోమవారంతో ఆ కస్టడీ ముగియడంతో కేజ్రీని సోమవారం కోర్టు ఎదుట హాజరుపర్చారు. ఈ సందర్భంగా దర్యాప్తు సంస్థ తరఫున వాదనలు వినిపించిన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు.. ఈడీ కస్టడీ పొడిగింపు కోరడం లేదని తెలిపారు. ఆయనను జ్యుడిషియల్ కస్టడీకి అప్పగించాలని కోరారు. విచారణకు ఆప్‌నేత సహకరించడం లేదు. ప్రశ్నలకు సమాధానం ఇవ్వడం లేదు. దర్యాప్తును తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. ఉద్దేశపూర్వకంగానే ఆయన డిజిటల్ పరికరాల పాస్‌వర్డ్‌లను చెప్పడం లేదు. కొన్ని రోజుల తర్వాత ఆయనను మళ్లీ కస్టడీలోకి తీసుకుంటాం. అప్పటిదాకా జ్యుడిషియల్ కస్టడీ విధించాలని ఈడీ వాదించింది. ఇందుకు న్యాయస్థానం అంగీకరించింది.

## కవిత మధ్యంతర బెయిల్ పటిషన్

**న్యూఢిల్లీ, ఏప్రిల్1(పీపుల్స్ మోటివేషన్):**

దిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన భారాస ఎమ్మెల్సీ కవిత మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై విచారణ ఏప్రిల్ 4కు వాయిదా పడింది. తన కుమారుడి పరీక్షల దృష్ట్యా ఈ నెల 16 వరకు బెయిల్ మంజూరు చేయాలని మార్చి 26న ఆమె రౌస్ అవెన్యూ న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. కవిత పిటిషన్‌పై సమాధానం చెప్పాలని న్యాయస్థానం ఈడీకి నోటీసులు జారీ చేస్తూ.. విచారణను వాయిదా వేసింది. గత నెల 15న హైదరాబాద్‌లోని తన నివాసంలో కవితను ఈడీ అరెస్టు చేసి మరుసటి రోజు రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపరిచిన సంగతి తెలిసిందే. ముందుగా ఈడీ 10 రోజుల కస్టడీకి కోరగా.. న్యాయస్థానం ఏడు రోజులకు అనుమతి ఇచ్చింది. అనంతరం మరో ఐదు రోజులు కస్టడీకి ఇవ్వాలని కోరగా.. మూడు రోజులకు అనుమతించింది. ఈడీ కస్టడీ మార్చి 26న ముగియడంతో.. అదే రోజు కోర్టులో దర్యాప్తు సంస్థ అధికారులు ఆమెను హాజరు పరిచారు. ఆ తర్వాత కవితకు 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించడంతో తిహాడ్ జైలుకు తరలించారు. కవిత తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. తన కుమారుడికి పరీక్షలు ఉండటంతో బెయిల్ ఇవ్వాలంటూ కోర్టుకెళ్లారు కవిత. ఏప్రిల్ 16వ తేదీ వరకు బెయిల్ కావాలంటూ పిటిషన్ వేశారు. తీహార్ జైలులో ఉన్న కవితకు 14రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధిస్తూ మార్చి 26 న కోర్టు ఆదేశాలిచ్చింది.

## ఆంధ్రప్రదేశ్ ఓపన్ స్కూల్ సొసైటీ

10th / INTER-ALL GROUPS (EM/TM)

అర్హులు :
గ్రామ వాలంటీర్లు / ఆశా వర్కర్లు
డ్రైవింగ్ లైసెన్స్ / అంగన్‌వాడి జాబ్స్

అన్ని ప్రభుత్వ ఉద్యోగాలు సాధించుటకు అర్హత కలదు.

- రెగ్యులర్ 10వ తరగతిలో 11 పేపర్లు పరీక్ష రాయాలి.
- కానీ ఓపెన్‌లో 5 పేపర్లు మాత్రమే పరీక్ష రాయాలి.
- రెగ్యులర్ 10వ తరగతిలో సమానమైన మరియు ఆంధ్రప్రదేశ్ ఓపెన్ సొసైటీ (గవర్నమెంట్) వారు అందిస్తున్న ఈ సర్టిఫికేట్ అన్ని ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హులు.
- ఈ సర్టిఫికేట్ అన్ని ప్రభుత్వ ఉద్యోగాలకు, ప్రమోషన్‌లకు మరియు ఇంటర్‌మీడియట్ చేరుటకు ఉపయోగపడును.
- సిలబస్ తక్కువ మరియు పాస్ కావడం సులభం.
- ఇంటర్ రెండు సంవత్సరాలు ఒకే సంవత్సరంలో ఖచ్చితంగా పాస్ అయ్యే అద్భుత అవకాశం.

DEGREE & P.G. DISTANCE EDUCATION

విద్యార్థులకు డైరెక్టుగా డిగ్రీ చదివే అవకాశం మరియు డిగ్రీ అయిన విద్యార్థులకు పి.జి. చేసుకొనుటకు అవకాశం.
ఈ సదవకాశాన్ని విద్యార్థులు / గవర్నమెంటు మరియు ప్రైవేటు ఉద్యోగస్తులు సద్వినియోగం చేసుకోవచ్చు.

| GROUP | COURSE | MEDIUM |
|---|---|---|
| BA | ALL GROUP | T/M |
| B.COM | GENERAL COMUTER | TM/EM |
| BBA | Bacherlor of Business Administration | |

| COURSE | MIDIUM |
|---|---|
| B.LISC | E/M |
| M.LISC | E/M |

| COURSE | MIDIUM |
|---|---|
| MBA | E/M |
| MCA | E/M |

| GROUP | COURSE | MEDIUM |
|---|---|---|
| MA | MHRM | E/M |
| | ENGLISH | E/M |
| | TELUGU | - |
| | HINDI | - |
| | HISTORY | T/M |
| | ECONOMICS | T/M |
| | POLITICAL SCIENCE | T/M |
| | SOCIOLOGY | T/M |
| | SANKRIT | - |
| M.Com | Banking Accountancy | E/M |
| MSW | Master of Social Work | E/M |

- MA : JOURNALISM AND MASS COMMUNICATION
- DIPLOMA IN FOOD PRODUCTION (EM)
- CERTIFICATE COURSE IN HIV COUNSELLING
- CERTIFICATE COURSE IN HOTEL & HOSPITAL HOUSE KEEPING

FOR DETAILS : 77991 46971

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation
మంగళవారం । ఏప్రిల్ । 2 । 2024



# పెరుగుతున్న ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలు జాగ్రత్తలు పాటించండి






- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.జవహర్ రెడ్డి

**కర్నూలు, ఏప్రిల్ 01 (పీపుల్స్ మోటివేషన్):-**

ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండేలా జాగ్రత్తలు పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్ని జిల్లాల జిల్లా కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.జవహర్ రెడ్డి ఆదేశించారు. సోమవారం ఉపాధి హామీ పనులు, త్రాగునీటి సరఫరా అమలు పై అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రానున్న రోజులలో ఎండ తీవ్రత పెరిగే అవకాశం ఉన్నందున అందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా అత్యవసర పని ఉంటే తప్ప మధ్యాహ్నం బయటికి రాకుండా ఉండాలన్నారు. సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు జాగ్రత్తలు పాటించాలన్నారు. జిల్లా స్థాయిలో సంబంధిత అధికారులతో హీట్ వేవ్ యాక్షన్ ప్లాన్ తయారు చేసుకోవడంతో పాటు ఒక నోడల్ అధికారిని ఏర్పాటు చేసుకోవాలన్నారు. అదే విధంగా సంబంధిత శాఖ అధికారులతో చర్చించి అందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వైద్య కేంద్రాలలోని ఎంఎల్హెచ్పి సిబ్బందికి అవసరం మేరకు ఐవి ఫ్లూయిడ్స్ ఇచ్చే విధంగా శిక్షణ ఇవ్వాలన్నారు. అదే విధంగా ఉపాధి హామీ పనులు జరిగే ప్రదేశంలో కూడా ఓఆర్ఎస్ పాకెట్స్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కర్నూలు పట్టణానికి ప్రతి రోజూ సుమారు 50 క్యూసెక్కుల నీరు అవసరం అవుతుందని అందుకు గాను 20 క్యూసెక్కుల నీరు సుంకేసుల నుండి 30 క్యూసెక్కుల నీరు గాజులదిన్నె నుండి తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం సుంకేసులలో నీరు తక్కువగా ఉండడం వల్ల గాజులదిన్నె నుండి 30 క్యూసెక్కుల నీటిని తీసుకోవడం జరుగుతుందన్నారు. గాజులదిన్నెలో సుమారు 1.2 టిఎంసి నీరు అందుబాటులో ఉందన్నారు. కెనాల్ సామర్థ్యం తక్కువగా ఉండటం వల్ల రోజు కేవలం 30 వేల క్యూసెక్కుల నీటిని మాత్రమే తీసుకోగలుగుతున్నామని జిల్లా కలెక్టర్ సిఎస్ కు వివరించారు. వీడియో కాన్ఫరెన్స్ జిల్లా పరిషత్ సీఈఓ నాసరరెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డి శేఖర్ రెడ్డి, డ్వామా పిడి అమర్నాథ్ రెడ్డి, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# మండల ముఖ్య నాయకుల సమావేశంలో బుసినే వెంకటేష్





**దేవనకొండ, ఏప్రిల్ 01 (పీపుల్స్ మోటివేషన్):-**

ఈరోజు ఆలూరు నియోజకవర్గం దేవనకొండ మండల కేంద్రంలో ఆలూరు నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇంచార్జ్ బుసినే విరుపాక్షి ఆదేశాల మేరకు సోదరుడు బుసినే వెంకటేష్ ఆధ్వర్యంలో మండలానికి చెందిన ముఖ్య నాయకులు కార్యకర్తలు వైఎస్ఆర్సిపి కుటుంబ సభ్యులతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బుసినే వెంకటేశ్ మాట్లాడుతూ... జరగబోయే ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా వైయస్ జగనన్నను చేసుకోవడానికి బుసినే విరుపాక్షి ని అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవడానికి అందరూ సమిష్టి కృషితో పనిచేయాలని కోరారు. ఈ ముఖ్య నాయకుల సమావేశంలో దేవనకొండ మండల నాయకుడు దివాకర్ నాయుడు, దేవనకొండ మండల కన్వీనర్ తపాల శ్రీనివాసులు, దేవనకొండ మండల ఎంపిపి లుముబా, గుమ్మరాళ్ళ గ్రామ సర్పంచ్ సోమశేఖర్ స్వామి, మండల నాయకులు కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, బూత్ కమిటీ మెంబర్లు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# 7వ వార్డులో తాగునీటి కటకట...

- ఆలస్యంగా నీటిని సరఫరా చేయడం పై ప్రజలు, నాయకుల ఆగ్రహం

**శిరివెళ్ల, ఏప్రిల్ 01 (పీపుల్స్ మోటివేషన్):-**

మండల కేంద్రంలోని 7వ వార్డులో తెల్లవారుజామున రావాల్సిన తాగునీరు ఉదయం 10 గంటల తర్వాత రావడంతో కూలీలు పనుల కాలంలో ఈ విధంగా నీరు వదలడం ఏమిటని 7వ వార్డు టిడిపి నాయకులు సురా రామ ఉల్లి వెంకటసుబ్బయ్య ఎం సుబ్బరాయుడు, షేక్షా, బెస్త సంఘం ప్రధాన కార్యదర్శి పెద్దరాయుడు వాపోయారు. ఈ మేరకు సోమవారం శిరివెళ్ల పంచాయతీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం కు వినతిపత్రం అందజేశారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఇక నైనా సకాలంలో నీటిని సరఫరా చేయాలని అధికారులను కోరారు. లేనిపక్షంలో ప్రజలతో కలిసి ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు.




## ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెండ్

**దేవనకొండ, ఏప్రిల్ 01 (పీపుల్స్ మోటివేషన్):-**



దేవనకొండ మండలం కుక్కల వెంకటాపురం గ్రామానికి చెందిన తలారి శ్రీరాములు ను ఫీల్డ్ అసిస్టెంట్ విధుల నుంచి తాత్కాలికముగా తొలగిస్తున్నట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ అమర నాథ్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అమర్ నాథ్ రెడ్డి మాట్లాడుతూ..మార్చి 19వ తేదీన పి కోటకొండ గ్రామంలో వైఎస్ఆర్సిపి నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనలను, ఎన్నికల కమిషన్ నిబంధనలను ఉల్లంఘించి ఫీల్డ్ అసిస్టెంట్ తలారి శ్రీరాములు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ప్రభుత్వ సంస్థలో పనిచేసే ఉద్యోగులందరూ ఎన్నికల ప్రచారంలో తిరగకూడదని ఎన్నికల కమిషన్ స్పష్టంగా చెప్పిందన్నారు. చట్టాలకు విరుద్ధంగా శ్రీరాములు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నందుకు సస్పెండ్ చేశామన్నారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఫోటోలు వీడియోలు అన్నీ కూడా సంబంధిత మండల అధికారుల నుంచి మాకు అందాయన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీరాములు నుంచి సంబంధిత డిపార్ట్మెంట్ ఇచ్చిన సిమ్ములు, సెల్ఫోన్, రికార్డులు స్వాధీనం చేసుకోమని మండల అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఎవరైనా ప్రభుత్వ సంస్థలో పనిచేసే ఉద్యోగులు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు.


## వీరభద్ర గౌడ్ ఆధ్వర్యంలో ఆలూరు టీడీపీలోకి మొదలైన వలసలు



**ఆలూరు, ఏప్రిల్ 01 (పీపుల్స్ మోటివేషన్):-**

ఆలూరు నియోజకవర్గ టీడీపీ పార్టీ అభ్యర్థి వీరభద్ర గౌడ్ ఆధ్వర్యంలో ఆలూరు పట్టణం టీడీపీ ఆఫీసులో హొళగుంద మండలం కోగలతోట గ్రామానికి చెందిన వైఎస్సార్ నాయకులు దాదాపు 60 కుటుంబాలకు చెందిన ముఖ్య నాయకులు ఇటిక్యాల వీరేశ్, యల్లప్ప, చంద్రశేఖర్, శేకన్న, రేణుకారాజ్, కృష్ణ, పరుశరాం, హంపయ్య, బసవరాజు, నాగరాజు, తాలూరు మల్లయ్య మొదలగు ముఖ్యనాయకులు టీడీపీ లో చేరడం జరిగింది. వీరభద్ర గౌడ్ వారందరికీ టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈకార్యక్రమంలో యువ నాయకులు గిరిమల్లేశ్ అలాగే ఆలూరు తాలూకా ఆరు మండలాలకు చెందిన ఆయా గ్రామాల టీడీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, ప్రస్తుతం వివిధ హోదాలలో ఉన్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు బివిజి పెద్దఎత్తున పాల్గొనడం జరిగింది.

## టీడీపీ వీడి 50 కుటుంబాలు వైఎస్సార్సీపీ పార్టీలో చేరిక



**ఆలూరు, ఏప్రిల్ 01 (పీపుల్స్ మోటివేషన్):-**

ఈరోజు ఆలూరు నియోజకవర్గం ఆలూరు మండలం పెద్ద హొతూరు గ్రామానికి చెందిన దాదాపుగా 25 సంవత్సరాల నుండి టిడిపి పార్టీలో ఉన్న 50 కుటుంబాలు ఆలూరు నియోజకవర్గం ఇంచార్జ్ బుసినే విరుపాక్షి ఆధ్వర్యంలో వైఎస్సార్సీపీ పార్టీలోకి చేరారు. ఈ కార్యక్రమంలో పార్టీలోకి చేరిన నాయకులు మాట్లాడుతూ... ఆలూరు నియోజకవర్గం లో ఇంతవరకు ఎవ్వరూ చేయలేని విధంగా బుసినే విరుపాక్షి ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటూ ఎవరికి ఏ ఆపద వచ్చిన నేనున్నానంటూ ప్రతి ఒక్కరికి అండగా ఉండే విరుపాక్షి సేవలను, గుర్తించి ఈరోజు వైఎస్ఆర్సిపి పార్టీలోకి చేరడం జరిగిందన్నారు. వైఎస్సార్సీపీ పార్టీ ఆశయాలకు అభివృద్ధికి అనుగుణంగా మరియు జరుగబోయే ఎన్నికల్లో బుసినే విరుపాక్షి విజయానికి మేమంతా కృషి చేస్తామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation

# పెబ్బేరు వ్యవసాయ మార్కెట్ గోదాం లో రేగిన మంటలు




మంటలు అదుపు చేయడానికి ప్రయత్నిస్తున్న వాటర్ ఫైర్ ఇంజన్లు




**పెబ్బేరు, ఏప్రిల్ 01(పీపుల్స్ మోటివేషన్):-**

పెబ్బేరు మున్సిపల్ పట్టణ కేంద్రంలో ఉన్న వ్యవసాయ గోదాంలో మంటలు ఉవ్వెత్తున రేగాయి సోమవారం సాయంత్రం 4:30 -5 గంటల మధ్యలో గోదాములో మంటలు రేగాయి పొగలు చూసిన జనం ఏమైందని పరుగులు తీయగా తీరా వెళ్లి చూశాక గోధుమలు మంటలు, పొగ రావడం చూసిన హమాలీలు సిబ్బంది అధికారులు వెంటనే ఫైర్ స్టేషన్, పోలీసులకు సమాచారం చేయడం జరిగింది పెబ్బేరు ఎస్సై హరి ప్రసాద్ రెడ్డి, ఘటన స్థలానికి చేరుకున్నారు. ఫైర్ స్టేషన్స్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు అయినప్పటికీ అదుపు కాలేదు, గోదాములో కోట్ల విలువ చేసే వరి ధాన్యము, వడ్ల వరి సంచుల బెండలు ఉన్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. షార్ట్ సర్క్యూట లేదా ఏమైనా ప్రాబ్లం,తెలియాల్సి ఉంది.


## కర్నూల్‌లో పర్యటించిన స్టెల్లా సతీష్



**కర్నూలు, ఏప్రిల్ 01 (పీపుల్స్ మోటివేషన్):-**

కర్నూలు పట్టణంలోని 39 వ వార్డు లో కార్పొరేటర్ సాంబశివరావు ఆధ్వర్యంలో ఇంటిం టా ఎన్నికల ప్రచారం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్ సతీమణి స్టెల్లా సతీష్ పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ప్రతి కార్యకర్త కష్టపడి వైసీపీని గెలిపించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గౌరు చరిత రెడ్డి ఆధ్వర్యంలో 60 కుటుంబాలు టిడిపిలోకి చేరిక



**కల్లూరు, ఏప్రిల్ 01 (పీపుల్స్ మోటివేషన్):-**

కల్లూరు పట్టణం 34వ వార్డు శివయ్య నగర్ వైసిపి పార్టీకి చెందిన 60 కుటుంబాలు వైసీపీ ని వీడి పాణ్యం నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి గౌరు చరిత రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి ఆమె కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు గోవిందమ్మ, సరోజమ్మ, గిడ్డమ్మ, దీవెనమ్మ, తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో కల్లూరు అర్బన్ కన్వీనర్ పురుషోత్తం రెడ్డి, జిల్లా కోశాధికారి మాదన్న, భాస్కర్ గౌడ్, నారాయణ గౌడ్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి మహిళకు 1500 రూపాయలు ఇస్తాం: గౌరు చరిత రెడ్డి




**కల్లూరు, ఏప్రిల్ 01 (పీపుల్స్ మోటివేషన్):-**

కల్లూరు పట్టణం టెలికాం నగర్ లో ఎన్నికల ప్రచారంలో భాగంగా పాణ్యం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గౌరు చరితారెడ్డి సోమవారం పర్యటించారు. ఆమె మాట్లాడుతూ... ఆడబిడ్డ నీధి కింద 18 సంవత్సరాలు దాటిన ప్రతి మహిళకు నెలకు 1500 రూపాయలు ఇస్తామని ఆమె తెలియజేశారు. కార్యక్రమంలో కల్లూరు అర్బన్ కన్వీనర్ పురుషోత్తం రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, రాయలసీమ విద్యార్థి విభాగం అధ్యక్షులు శ్రీరాములు, టిడిపి జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రవీందర్ రావు ను సన్మానించిన కాంగ్రెస్ కమిటీ




- **పార్టీ విధేయతకు గుర్తింపు**

**నర్సంపేట, ఏప్రిల్ 01 (పీపుల్స్ మోటివేషన్):-**

నర్సంపేట పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధిగా పిసిసి ద్వారా నియామకయమైన తక్కలపల్లి రవీందర్ రావు ను పట్టణ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు, ఈ సందర్భంగా నర్సంపేట పట్టణ అధ్యక్షులు రాజేందర్ మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్య గౌడ్ మాట్లాడుతూ తక్కలపల్లి రవీందర్రావు గత 25 సంవత్సరాలు క్రితం దొంతి మాధవ రెడ్డి ఆహ్వానం మేరకు కాంగ్రెస్ పార్టీలో చేరి రెండు పర్యాయాలు పిఎసిఎస్ చైర్మన్గా ఖానాపురం ఎంపీపీగా కొనసాగి గౌరవ మాధవ రెడ్డి సూచనల మేరకు నియోజకవర్గం కన్వీనర్ గా కొనసాగుతూ వారి యొక్క పనితీరుకు పార్టీ విధేయతకు ప్రభుత్వం ఉన్నా లేకున్నా గౌరవ మాధవ రెడ్డి అనుచరుడుగా కొనసాగుతున్న క్రమంలో నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి సూచనల మేరకు పిసిసి ద్వారా వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా నియమించబడడంవిధేయతకు మాధవ రెడ్డి ఇచ్చే గుర్తింపు అని అన్నారు రాబోయే రోజుల్లో మరిన్ని ఉన్నతమైన పదవులను రవీందర్రావు అధిరోహించాలని కాంగ్రెస్ పార్టీకి సేవలు అందించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో నర్సంపేట పట్టణ అధ్యక్షులు బత్తిని రాజేందర్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్య గౌడ్, కౌన్సిలర్ ఎలకంటి విజయ్ కుమార్, నర్సంపేట పట్టణ ప్రధాన కార్యదర్శి మాదాసి రవి, నర్సంపేట పట్టణ ఉపాధ్యక్షులు వేముల సారంగం గౌడ్, దూడల సాంబయ్య, మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు ఎండి మసూద్, నర్సంపేట నియోజకవర్గం మైనార్టీ కన్వీనర్ ఎండి బాబా, మాది వార్డ్ మెంబర్ గాజుల రమేష్, పట్టణ కార్యదర్శులు నాడెం నాగేశ్వర్, నాంపల్లి వెంకట్ గౌడ్, పట్టణ కిసాన్ సెల్ అధ్యక్షుడు ముత్తినేని వెంకన్న, లక్కాసు రమేష్, దండెం రతన్ కుమార్, బిట్ల మనోహర్, కొప్పు అశోక్, గోపు మహేందర్ రెడ్డి, ఎరుకల రమేష్, ఎండి అయూబ్ ఖాన్, కుమార్, దేశి సాయి పటేల్, కుసుమ సాయి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంఘాల గ్రామ ఐక్య సంఘాల అధ్యక్షురాలు మరియు ఎంపిటిసి భర్త వెంకటయ్య నాయుడు కుంభకోణం



**శ్రీరంగాపూర్/వనపర్తి, ఏప్రిల్ 01 (పీపుల్స్ మోటివేషన్):-**

శ్రీరంగాపురం మండలం తాటిపాముల గ్రామ ఐక్య మహిళా సంఘం అధ్యక్షురాలు ఆ గ్రామంలో మహిళ సంఘాలలో పెద్ద ఎత్తున కుంభకోణం జరిగిందని పలు సంఘాల మహిళలు ఇదంతటికీ కారణం ఆ గ్రామ ఎంపీటీసీ భర్త అయిన వెంకటయ్య నాయుడు ఆమెకు మద్దతు ఇచ్చి గ్రామంలో ఉన్న మహిళలను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని మహిళా సంఘాలలో ఆయన పెత్తనం చెలాయిస్తూ ఎక్కడైనా వెళ్లి ఫిర్యాదు చేయాలన్న మమ్మల్ని ఇబ్బందులకు గురి చేస్తున్నాడని గతంలో టిఆర్ఎస్ పార్టీలో ఉంటూ ఈరోజు అధికారం లేదని రెండు రోజుల క్రితమే కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిందని మహిళలని చూడకుండా మమ్మల్ని ఇబ్బంది పెట్టి మమ్మల్ని నష్టపరిచిన వారిపై చర్య తీసుకోవాలని వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ కు ఫిర్యాదు చేస్తే కలెక్టర్ స్పందించి డి ఆర్ డి ఓ తో మాట్లాడి వెంటనే ఈ సమస్య సాలు చేయాలని మూడు రోజుల్లో ఉన్నత సాయి అధికారుల సమక్షంలో కమిటీ వేసి తాటిపాముల గ్రామంలో ఈ సమస్య సాలు చేయాలని కలెక్టర్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

## అంబేద్కర్ యువజన సంఘం వ్యవస్థాపకులు దేవుని చంద్రయ్య డీఎఫ్ఓ 60వ జయంతి



**శ్రీరంగాపూర్/ వనపర్తి, ఏప్రిల్ 01 (పీపుల్స్ మోటివేషన్):-**

శ్రీరంగాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో దేవుని శ్రీనివాసులు చేతుల మీదుగా పండ్లు పంచడం జరిగింది. మరి అలాగే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కె.రాజేష్ ఆధ్వర్యంలో సంఘం సభ్యులు పెబ్బేరు ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు పంచడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు మరియు నాయకులు పాల్గొనడం జరిగింది.

## శాఖాపురం గ్రామంలో వనపర్తి రెడ్ క్రాస్ సొసైటీ వారి సహకారంతో రక్తదాన శిబిరరం

- **న్యాయవాది గోవిందు నాయుడు ఆధ్వర్యంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు**

**పెబ్బేరు, ఏప్రిల్ 01 (పీపుల్స్ మోటివేషన్):-**

పెబ్బేరు మండల పరిధిలో శాగపుర్ గ్రామానికి చెందిన న్యాయవాది గోవింద్ నాయుడు మనవరాలు రితన్యా 3వ పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. వారి ఆహ్వానం మేరకు ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఎం.రాజేంద్ర ప్రసాద్ యాదవ్ వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ... రితన్యా చిన్నారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ మనవరాలు మీద ప్రేమతో ఇంత మంచి ఆలోచనతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసిన గోవింద్ నాయుడు కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పెబ్బైర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎద్దుల విజయవర్ధన్ రెడ్డి,పెబ్బైర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కారపాకుల వెంకట్రాములు యాదవ్, రాంపురం సహదేవుడు, జనుపల్లి మహేశ్వర్ రెడ్డి తోమలపల్లి కృపాకర్ రెడ్డి శాఖపురం మాజీ సర్పంచ్ రవికుమార్ యాదవ్, డైరెక్టర్ ఆంజనేయులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.



తెలుగు దినపత్రిక

పీపుల్స్ మోటివేషన్

People's Motivation

మంగళవారం । ఏప్రిల్ । 2 । 2024




# లిక్కర్ దోస్తీ

- నిబంధనలు నీల్......
- మద్యం అమ్మకాలు ఫుల్...
- మండలం లో మద్యం మాయ.......
- మద్యంతో మండలం ఉక్కిరి బిక్కిరి....

**చెన్నారావుపేట, ఏప్రిల్ 01 (పీపుల్స్ మోటివేషన్):-**

చెన్నరావుపేట మండలంలో రోజు రోజుకూ పుట్ట గొడుగులు లాగా పుట్టుకొస్తున్నాయి, ఎంపీ ఎన్నికల కోడ్ అమలులో వున్న రోజు రోజు కు మద్యం అమ్మకాలు పెరిగిపోతున్నాయి.మండలంలో గల గ్రామాల్లో మద్యం అమ్మకాలు జోరు, అధికారుల పర్యవేక్షణ పూర్...అని మండలం లో బహిరంగంగానే అరోపణలు వస్తున్నాయి.

**సందు సందులో మందు.......**

మండలంలో గల 30 గ్రామాల్లో మద్యం ఏరులై పారుతున్న సంబంధిత శాఖ అధికారులు మాత్రం ఏం



సంబంధం లేదు అన్నట్టు వ్యవహరిస్తున్నారు అని అరోపణలు వస్తున్నాయి. గ్రామల్లో మధ్య రాత్రి 12 గంటల వరకు బెల్ట్ షాప్ నిర్వాహకులు అమ్మడం తో యువత, గ్రామాల్లో గిరిజనుల జీవితాలు అతల కుతలం అవుతున్న ఎక్సైజ్ శాఖ ఏ మాత్రం పట్టించుకోకపోవడం అనేది ఎలాంటి పరిస్థితులకు దారి తీస్తుందో ఆని గ్రామాల్లో విశ్లేషకులు చర్చించుకుంటున్నారు.

**ఏరులై పారుతోంది.......**

గ్రామాల్లో గుడుంబా, మద్యం ఏరులై పారుతున్న అంత ఏమరుపాటు తనం ఎందుకో ఎక్సైజ్ శాఖ కు ఆని విద్యావంతులు ఆరోపిస్తున్నారు. షాప్ షాపుకి మద్యం అమ్మకాలు జోరుగా విక్రయిస్తున్న పర్యవేక్షణ పక్కదారి పట్టింది.

**మద్యం తో మండలం ఉక్కిరి బిక్కిరి.......**

మండలంలో ఏ ఊరు చూసిన మద్యం తో మునిగి తేలుతుంది. అయినా అధికారులు రారు అపరూ అంటూ గ్రామాల్లో బహిరంగంగా అరోపణలు వస్తున్నాయి.

**దోస్తీ.... దోస్తీ.... దోస్తీ.....**

మద్యం ప్రియులు మద్యం తో దోస్తీ అట, మరీ అధికారులు ఎవరితో దోస్తీ, అంటూ విపరీతమైన అరోపణలు వస్తున్న అదికారులు దాడులు చేయడంలో ఎందుకు వెనుక ఆడుతున్నరో అంటూ ఆరోపణలు వెల్లువ.

## రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది

- సాగునీరు అందక కన్నీళ్లు పెడుతున్నారు
- రైతులను పరామర్శించని మంత్రులు
- మాజీమంత్రి నిరంజన్ రెడ్డి విమర్శలు

**హైదరాబాద్, ఏప్రిల్1(పీపుల్స్ మోటివేషన్):**

రాష్ట్రంలో రైతుల పరిస్థితి చూస్తుంటే కన్నీళ్లు వస్తున్నాయని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. సాగునీరు ఇవ్వకుండా ప్రభుత్వం చోద్యం చూస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతులు పంటలు తగులబెట్టుకుంటుంటే బాధ కలుగుతుందన్నారు. రైతులకు వ్యతిరేకం గా మంత్రి తుమ్మల మాట్లాడటం బాధకలిగిందని వెల్లడించారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కష్టపడి సాగుచేసిన రైతు తన పొలాన్ని తగులబెట్టుకునే దుస్థితి దాపురించిందన్నారు. కాంగ్రెస్ మంత్రులు, నేతలు రైతుల దగ్గరికి ఎందుకు వెళ్లడం లేదని ప్రశ్నించారు. రైతుల దగ్గరికి వెళ్లే ధైర్యం కాంగ్రెస్ మంత్రులు, నేతలకు లేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అదనంగా ఏదో వస్తుందని ఆశపడ్డామని రైతులు ఆవేదన చెందుతున్నారని చెప్పారు. హోల్‌సేల్‌గా కాంగ్రెస్ మోసం చేస్తుందనుకోలేదని బాధపడుతున్నారని పేర్కొన్నారు. ఆత్మవంచన చేసుకొని ఎందుకు మాట్లాడు తున్నారని ప్రశ్నించారు. మంత్రిని చూస్తే జాలేస్తున్నదని, ఎవరిని మెప్పించడానికి పాట్లుపడు తున్నారని అడిగారు. ఉద్యమం సమయంలో చంద్రబాబు, రాజశేఖర్ రెడ్డి సీఎంలుగా ఉన్నపుడు వాళ్ల దృష్టిలో పడటానికి కేసీఆర్‌ను ఇంతకంటే ఎక్కువగా తిట్టారని విమర్శించారు. తర్వాత కేసీఆర్ దగ్గరికి వచ్చి మంత్రివర్గంలో పనిచేసి ఇప్పుడు మళ్లీ పక్క పార్టీలోకి పోయి తిడుతున్నారని చెప్పారు. ఇలాంటివి ఎన్నో చూశాం, ఎంతో మందిని చూశాం.. అమావాస్య తర్వాత పౌర్ణమి వస్తుంది. అన్ని అమావాస్యలు మావి కావు, అన్ని పౌర్ణమిలు మీవి కావన్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతులకు చేసినవన్నీ తుమ్మలకు తెలుసన్నారు. చేతనైతే రైతు భరోసా రూ.15 వేలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. తాము చేసినదానికంటే రైతులకు ఎక్కువ మేలు చేయాలని సూచించారు. కేసీఆర్, కాళేశ్వరం ప్రాజెక్టుపై బురద చల్లే దుర్బుద్ధే కనిపించిందని విమర్శించారు. రైతులకు నీళ్లు ఇవ్వాలన్న సోయి కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదన్నారు.ఉత్తర తెలంగాణలో సగటుకంటే ఎక్కువ వర్షపాతం నమోదయిందని, దక్షిణ తెలంగాణలో వర్షపాతం కొంచెం తక్కువ ఉందని చెప్పారు. చరిత్రలో ఎన్నడూ లేనంత వదరగ గోదావరిలో గత వర్షాకాలంలో వచ్చిందన్నారు. అత్యధిక వరద వల్లనే మేడిగడ్డ బరాజ్‌లో రెండుమూడు పిల్లర్లకు నష్టం కలిగిందని చెప్పారు. ఇప్పుడు ఎత్తిపోస్తున్న నీళ్లే రెండు నెలల కింద ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ తెచ్చిన కరువని ఆరోపించారు. కాంగ్రెస్‌కు పాలన చేతగాక మందిమీద నిందలు వేస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికారంలో ఉన్నవాళ్లు మాటలతో ఎక్కువ రోజులు దృష్టి మరల్చలేరన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కరువుకు కేరాఫ్‌గా కాంగ్రెస్ పాలన ఉండేదని, నిబద్ధత ఉంటే రైతు దశ మార్చవచ్చని కేసీఆర్ నిరూపించారని తెలిపారు. వ్యవసాయం చేయొచ్చని రైతులకు కేసీఆర్ భరోసా కల్పించారని చెప్పారు.

## అబద్దాలతో.. గద్దెనెక్కిన కాంగ్రెస్

**కాంగ్రెస్‌తో పాటే వచ్చిన కరువు**

**గద్వాల ఎమ్మెల్యే బండ్ల విమర్శలు**

**జోగులాంబ గద్వాల, ఏప్రిల్1(పీపుల్స్ మోటివేషన్):**

అబద్ధపు మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంతోనే కరువు వచ్చిందని, కరెంట్ కష్టాలు ప్రారంభమయ్యాయని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధిష్ఠానం పిలుపుమేరకు సోమవారం జిల్లాలోని కేటిదొడ్డి మండలం ఉమిత్యాల గ్రామ శివారులో గల వ్యవసాయ పొలంలో ఎండిన పంటలను బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..100 రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తానన్న ఆరు గ్యారెంటీలు అటకెక్కాయని ధ్వజమెత్తారు. డిసెంబర్ 9న రూ.2 లక్షల రూణమాఫీ అంటూ హామీ ఇచ్చిన కాంగ్రెస్ అన్నదాతలను పూర్తిగా ఆగం చేసిందని మండిపడ్డారు. జిల్లా వ్యాప్తంగా ఎండిన పంటలకు ప్రతి ఎకరాకు రూ. 25వేల నష్ట పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు పరిహారం ఇచ్చేవరకు ప్రభుత్వాన్ని వెంటాడుతామని హెచ్చరించారు. ఎమ్మెల్యే వెంట ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

## దంచికొడుతున్న ఎండలు

- 43 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

**నల్లగొండ, ఏప్రిల్1(పీపుల్స్ మోటివేషన్):**

రాష్ట్రంలో ఎండలు దంచికొడుతున్నాయి. ఇప్పటికే పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 43 డిగ్రీల గరిష్టానికి చేరుకున్నాయి. సూర్యుడి ప్రతాపంతో ఉదయం నుంచే ఉక్కపోత మొదలవుతున్నది. పొద్దున 9 గంటలకే భానుడు భగభమంటున్నాడు. రాబోయే 5 రోజులపాటు ఉష్ణోగ్రతలు మరింత తీవ్రంగా ఉంటాయని హైదరాబాద్ వాతారణ కేంద్రం తెలిపింది. 15 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీచేసింది. ఉత్తర తెలంగాణ జిల్లాలకు వడగాడ్పుల ముప్పు అధికంగా ఉంటుందని పేర్కొంది. నల్లగొండ జిల్లాలోని శివన్నగూడెంలో అత్యధికంగా 43.1 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. మరో రెండు రోజుల్లో ఉష్ణో గ్రతలు 44 డిగ్రీలకు చేరే అవకాశం ఉన్నట్టు అధికారులు తెలిపారు. కాగా, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబ్ నగర్, నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల, నాగర్ కర్నూల్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీచేశారు.

## బిజెపి మతోన్మాదాన్ని అడ్డుకోవడమే లక్ష్యం

**హనుమకొండ, ఏప్రిల్1(పీపుల్స్ మోటివేషన్):**

భాజపా మతోన్మాదాన్ని అడ్డుకోవడం కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. లౌకికవాదాన్ని నిలబెట్టుకోవాలనే ఆ పార్టీలో చేరినట్లు చెప్పారు. తన కుమార్తె కావ్యతో కలిసి హనుమకొండలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును ఆయన కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. తన నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు అధికార పార్టీలో చేరినట్లు కడియం తెలిపారు. కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ మరోసారి మోసం చేసేందుకే భారాస అధినేత కేసీఆర్ వస్తున్నారని విమర్శించారు. కాళేశ్వరం ఆయనకు ఏటీఎంలా మారిందన్నారు. భారాస ప్రభుత్వ హయాంలో రైతులను పట్టించుకోలేదని ఆరోపించారు. రాష్ట్రంలో వచ్చిన కరవుకు గత ప్రభుత్వమే కారణమన్నారు.

## ఇరిగేషన్ రంగాన్ని సర్వనాశనం చేసిన కెసిఆర్

- పంటల బీమా అమలు చేయని ఏకైక రాష్ట్రం తెలంగాణ
- అబద్దాలతో మళ్లీ ప్రజల్లోకి వెళ్లిన కెసిఆర్
- కరువు వచ్చిందే బిఆర్ఎస్ పాలనలోనే అన్న ఉత్తమ్

**హైదరాబాద్, ఏప్రిల్1(పీపుల్స్ మోటివేషన్):**

కెసిఆర్ హయాంలో ఇరిగేషన్ రంగం సర్వనాశనం అయ్యిందని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. ఇరిగేషన్ రంగంలో కేసీఆర్ చేసిన దోపిడీ దేశంలో ఎవరూ చేయలేదన్నారు. జనగామ, సూర్యపేట జిల్లాలో కేసీఆర్ పర్యటించి, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శస్తూ కేసీఆర్ చేసిన వ్యాఖ్యలకు మంత్రి ఉత్తమ్ కౌంటర్ ఇచ్చారు. నిన్న కేసీఆర్ అన్ని అబద్దాలే మాట్లాడారని మండిపడ్డారు. గాంధీ భవన్‌లో ఉత్తమ్ మీడియాతో మాట్లాడుతూ.. ఉమ్మడి ఏపీ కంటే కేసీఆర్ హయాంలో తెలంగాణకు ఎక్కువ ద్రోహం జరిగిందన్నారు. పోలీస్ శాఖను ఎక్కువ మిస్ యూజ్ చేసింది కేసీఆరే అని విమర్శించారు. పోలీసులు న్యూట్రల్‌గా ఉండాలని ఇప్పుడు కేసీఆర్ చెప్పడం హాస్యాస్పదమన్నారు. కరువు వచ్చింది బీఆర్ఎస్ పాలనలోనే అని... దాన్ని సమర్థవంతంగా డీల్ చేస్తున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ పేర్కొన్నారు.బీఆర్ఎస్ సర్కార్ హయాంలో రైతులకు పంట బీమా కల్పించలేదని.. .దేశంలో పంట బీమా కల్పించని ఏకైక సర్కార్ బీఆర్ఎస్ దేనని విమర్శించారు. వరదలు, కరువుతో పంట నష్టపోతే.. ఒకటి రెండు చోట్లకు వెళ్లి కేసీఆర్ డ్రామా చేశాడని.. ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని దుయ్యబట్టారు. మైక్ పనిచేయకుంటే కరెంట్ పోయిందంటూ కేసీఆర్ అబద్దాలు మాట్లాడారని.. పవర్ విషయంలో బీఆర్ఎస్ చేసిందేమీ లేదన్నారు. 24 గంటల పవర్ పాలసీని కొనసాగిస్తున్నాం.. రాష్ట్రంలో పవర్ కట్స్ లేవని స్పష్టం చేశారు.కాళేశ్వరం గురించి మాట్లాడటానికి కేసీఆర్‌కు సిగ్గుండాలి. తలదించుకోవాలి.. ముందు తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. కాళేశ్వరంలో కమిషన్ల కోసం అంచనాలు పెంచారని చెప్పారు. కృష్ణా ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పజెప్పిందే కేసీఆర్ అని నిప్పులు చెరిగారు. కేసీఆర్, జగన్ దోస్తీతో తెలంగాణకు అన్యాయం జరిగిందని.. కృష్ణా నుంచి జగన్ అక్రమంగా నీళ్లను తరలిస్తున్నా కేసీఆర్ నోరు మెదపలేదని ఉత్తమ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో కంటే కేసీఆర్ హయాంలోనే ఏపీకి ఎక్కువ నీళ్లు తరలి వెళ్లాయన్నారు. కేసీఆర్ భయాందోళనలో ఉన్నాడు.. అందుకే పొలం బాట పట్టారని చెప్పారు. కేసీఆర్ పొంకనాలకు పోయి పార్టీని నాశనం చేశాడని విమర్శించారు. బీఆర్ఎస్ పదేళ్లలోనే కుప్పకూలిందని.. పార్లమెంట్ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో బీఆర్ఎస్ కనుమరుగవుతుందని మంత్రి ఉత్తమ్ చెప్పారు. ఇన్ని మాటలు మాట్లాడుతున్న కెసిఆర్ బిఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులకు పంట బీమా ఎందుకు కల్పించలేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అడిగారు. దేశంలో పంట బీమా కల్పించని ఏకైక ప్రభుత్వం బిఆర్ఎస్సేనని ధ్వజమెత్తారు. పార్లమెంటు ఎన్నికల తరువాత బిఆర్ఎస్ కనుమరుగుకావడం ఖాయమని జోస్యం చెప్పారు. 24 గంటల పవర్ పాలసీ కొనసాగిస్తున్నామని, నిమిషం పవర్ కట్స్ ఎక్కడా లేవన్నారు. తెలంగాణ రైతాంగం, ఇరిగేషన్‌ను సర్వనాశనం చేసి వ్యక్తి కెసిఆర్ అని, అందుకు ఆయన సిగ్గుపడాలి, తలదించుకోవాలి, తెలంగాణ జనాలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇరిగేషన్ రంగాన్ని కెసిఆర్ నాశనం చేయడంతో పాటు దోపిడీ చేశారని ఆరోపణలు చేశారు. కాళేశ్వరం గురించి మాట్లాడేందుకు కెసిఆర్‌కు సిగ్గుండాలని, కాళేశ్వరంలో కమీషన్ల కోసం అంచనాలు పెంచారని, కళ్ల ముందే కాళేశ్వరం కుంగినా మాట్లాడటం మూర్ఖత్వం కిందకు వస్తుందని ఉత్తమ్ ధ్వజమెత్తారు. కేసీఆర్ మాట్లాడిన ప్రతి మాట అబద్ధమే అని.. ఆయన డిప్రెషన్, ఫ్రస్టేషన్‌లో ఉన్నారంటూ వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్, ఆయన కుటుంబసభ్యులు తప్ప బీఆర్ఎస్‌లో ఎవరూ మిగలరన్నారు. పదేండ్లలో పంట నష్టం జరిగితే కేసీఆర్ రూపాయి కూడా ఇవ్వలేదని గుర్తుచేశారు. ఇరిగేషన్‌పై మాట్లాడే అర్హత కేసీఆర్‌కు లేదన్నారు. ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పచెప్తామని బీఆర్ఎస్ చీఫ్ ఒప్పుకున్నారని గుర్తుచేశారు. కేసీఆర్ - జగన్ కలిసి ఉమ్మడి నల్గొండ, ఖమ్మం జిల్లాలపై కుట్ర చేశారని ఆరోపించారు.

## ఆస్తి తగాదాలో తమ్ముడిపై అన్న దాడి

**కామారెడ్డి, ఏప్రిల్1(పీపుల్స్ మోటివేషన్):**

కామారెడ్డి జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. ఆస్తి కోసం మానవ సంబంధాలను మరిచి తమ్ముడిపై అన్న, వదిన దాడి చేశారు. ఈ విషాదకర సంఘటన జిల్లాలోని దోమకొండ మండలం అంబారీపేటలో చోటు చేసుకుంది. ఆస్తి తగాదాల నేపథ్యంలో తమ్ముడి క్షౌరశాలకి వెళ్లి మరీ కత్తితో దాడి చేశారు. స్థానికులు వెంటనే క్షతగాత్రుడిని దవాఖానకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## జనసేనలో చేరిన మండలి బుద్ధప్రసాద్

**అవనిగడ్డ నుంచే పోటీకి సంసిద్ధం**



**గుంటూరు, ఏప్రిల్1(పీపుల్స్ మోటివేషన్):**

మాజీ ఉపసభాపతి, టీడీపీ సీనియర్ నేత మండలి బుద్ధప్రసాద్ జనసేనలో చేరారు. సోమవారం మంగళగిరిలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సమక్షంలో బుద్ధప్రసాద్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. బుద్ధప్రసాద్‌కు పవన్ జనసేన కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ ఉపసభాపతి మాట్లాడుతూ.. అవనిగడ్డలో తనను నిలబడాలని పవన్ కోరారని తెలిపారు. చంద్రబాబు కూడా దీనికి మద్దతు ఇచ్చారన్నారు. తనకు టికెట్ ఖాయం అయిందని.. ఈరోజు అధికారికంగా తన పేరు ప్రకటిస్తారని వెల్లడించారు. ఐదేళ్లుగా ఏపీలో జరగని అరాచకం లేదని అన్నారు. వేలకోట్ల దోపిడీ జరిగిందని ఆరోపించారు. తెలుగు భాష అభివృద్ధికు తాము చేసిన కృషిని ఎన్నోసార్లు మెచ్చుకున్నారని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ తరఫున అవనిగడ్డ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేయాలని మండలి బుద్ధప్రసాద్ భావించారు. అయితే టీడీపీ - బీజేపీ పొత్తులో భాగంగా అవనిగడ్డ అసెంబ్లీ టికెట్ జనసేనకు కేటాయించడం జరిగింది. దీంతో మండలి బుద్ధ ప్రసాద్ టీడీపీకి గుడ్‌బై చెప్పేసి జనసేన పార్టీలో చేరారు. ఏపీలో టీడీపీ - బీజేపీలతో పొత్తు కారణంగా జనసేన పార్టీ 21 అసెంబ్లీ స్థానాలు, 2 ఎంపీ స్థానాల్లో పోటీ చేస్తోంది. ఇప్పటికే 19 అసెంబ్లీ స్థానాలకు, 2 ఎంపీ స్థానాలకు అభ్యర్థులతో జాబితా విడుదల చేసింది. ఇక మిగిలింది అవనిగడ్డ, పాలకొండ స్థానాలు మాత్రమే. ఇప్పుడు మండలి రాకతో ఆయన అవనిగడ్డలో పోటీచేసే అవకాశాలు ఉన్నాయి.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation

# కడియంకు టిక్కెట్ ఇప్పించిందే తాను

- మాజీ ఎమ్మెల్యే ఎర్రబెల్లి విమర్శలు
- అతిపెద్ద కుట్రదారు కడియం అన్న పెద్ది

**వరంగల్, ఏప్రిల్1(పీపుల్స్ మోటివేషన్):**

కడియం శ్రీహరికి ఎమ్మెల్యే టికెట్ ఇప్పించింది తనేనని బీఆర్ఎస్‌ను వీడిన స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపైమాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఫైర్ అయ్యారు. అలాగేమంత్రి పదవి వచ్చేలా చేసింది కూడా తానేనని పేర్కొన్నారు. అయినా పార్టీకి ద్రోహం చేసి వెళ్లాడని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీలో శ్రీహరికి ఏం తక్కువ చేయలేదు. డిప్యూటీ సీఎంగా, ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీ, ఎంపీగా అవకాశాలు ఇచ్చింది పార్టీ అని అన్నారు. ఆయన పదవులు రావడం కోసం ఎంతో కృషి చేశానని చెప్పారు. వరంగల్ సమావేశంలో మాట్లాడుతూ..ఎన్నో అవకాశాలు కల్పించిన తల్లి లాంటి పార్టీకి బిడ్డ కోసం తీవ్ర ద్రోహం చేశారని మండిపడ్డారు. కష్ట కాలంలో పార్టీకి అండగా ఉండాల్సింది పోయి స్వార్థ ప్రయోజనాల కోసం కాంగ్రెస్‌లో చేరడం ఆయన వక్రబుద్ధికి నిదర్శనమన్నారు. ప్రతి ఎన్నికల్లో కడియం గెలుపునకు కృషి చేశానని, వచ్చే ఎన్నికల్లో కడియం శ్రీహరి ఓటమే లక్ష్యంగా పని చేస్తానని స్పష్టం చేశారు. ఇలాంటి అవకాశ వాదులకు ప్రజలు ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఇదిలావుంటే వరంగల్ జిల్లాలోనే అతిపెద్ద రాజకీయ కుట్రదారు కడియం శ్రీహరి అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ధ్వజమెత్తారు. వరంగల్‌లో ఆయనను ఓడించి రాజకీయ ప్రతీకారం తీర్చుకుంటామని సుదర్శన్ రెడ్డి తేల్చిచెప్పారు. బీఆర్ఎస్ వరంగల్ పార్లమెంట్ విస్తృత స్థాయి సమావేశంలో సుదర్శన్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. అన్ని రకాల పదవులు అనుభవించిన కడియం శ్రీహరి.. ఇవాళ కేసీఆర్‌ను మోసం చేసి పార్టీని వీడారు. డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీగా పదవులు అనుభవించి చివరకు వరంగల్ జిల్లాలోని బీఆర్ఎస్ నేతలను నట్టేట ముంచారు కడియం శ్రీహరి. ఈ జిల్లాలోనే అతిపెద్ద రాజకీయ కుట్రదారు కడియం శ్రీహరి పార్లమెంట్ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని సుదర్శన్ రెడ్డి పిలుపునిచ్చారు. వరంగల్ పార్లమెంట్ పరిధిలోని ప్రతి బీఆర్ఎస్ కార్యకర్త కసితో పని చేయాలి. కేసీఆర్ ఆపదలో ఉన్నారు. కవిత జైల్లో ఉన్నారు. కేసీఆర్‌పై అనేక కుట్రలు జరుగుతున్నాయి. తనకు 32 ఏండ్ల రాజకీయ అనుభవం ఉంది. కడియం లాంటి మోసగాడిని తన జీవితంలో చూడలేదు. తమ కోరిక ఏందంటే.. ఈ పార్లమెంట్ ఎన్నికలతో కడియం శ్రీహరి రాజకీయ సన్యాసం తీసుకునేట్టు చేయడమే అని సుదర్శన్ రెడ్డి తేల్చిచెప్పారు. గతంలో కడియం శ్రీహరిని ఓడగొట్టిన దాని కంటే ఎక్కువ కసితో బీఆర్ఎస్ కార్యకర్తలు పని చేయాలి. అధికారం శాశ్వతం కాదు. వరంగల్‌లో జరిగే రాజకీయం వేరు. రేవంత్ రెడ్డి కుట్రలో భాగంగానే కడియం కాంగ్రెస్ కండువా కప్పుకున్నాడు. కడియం శ్రీహరి టీఆర్ఎస్ పార్టీలో అడుగు పెట్టక ముందే ఘనపూర్‌లో గులాబీ జెండా ఎగిరింది. వరంగల్‌లో బీఆర్ఎస్ ఓడిపోతుందని చెప్పి, ఆ టికెట్ తన బిడ్డకు ఇష్టం లేకనే పార్టీ నుంచి తప్పుకున్నట్లు కడియం శ్రీహరి స్టేట్‌మెంట్ ఇచ్చారు. అందుకే కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసమే ఆ పార్టీలో చేరానని తెలిపారు. రేపు కాంగ్రెస్ పార్టీలో కూడా అలానే అనిపిస్తే.. చివరకు కేఏ పాల్ పార్టీలోకి అలానే వెళ్తావా..? అని సుదర్శన్ రెడ్డి ప్రశ్నించారు. నాగుపాముకు, కడియంకు తేడాలేదు. పార్టీలోకి కడియం వచ్చిప్పుడు వ్యతిరేకించిన వారిలో తాను కూడా ఉన్నాను. మేం త్యాగాలు చేస్తే పదవులు అనుభవించారు కడియం. ఆయనకు కేడర్ పది మంది కంటే ఎక్కువ లేరు. 75 ఏండ్ల వయసులో ఉన్న నీవు కొత్త తరానికి ఏం మేసేజ్ ఇస్తున్నావు. ఇదేనా నీ రాజకీయ పరిణితి. ఏ పార్టీ గెలిచే అవకాశం ఉంటే ఆ పార్టీలోకి వెళ్లడమేనా నీ రాజకీయ తెలివి అని సుదర్శన్ రెడ్డి నిప్పులు చెరిగారు.

# సిరిసిల్లలోనూ ఫోన్ ట్యాపింగ్

**పోలీస్ కిషనర్‌కు కెకె ఫిర్యాదు**

**హైదరాబాద్, ఏప్రిల్1(పీపుల్స్ మోటివేషన్):**

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో హైదరాబాద్ కమిషనర్‌ను కలిసి కాంగ్రెస్ సీనియర్ నేత కేకే మహేందర్ రెడ్డి ఫిర్యాదు చేశారు. బషీర్ బాగ్ ఓల్డ్ సీపీ ఆఫీస్ లో సీపీని కలిసి ఆధారాలు సమర్పించారు. సిరిసిల్లలో వార్ రూం ఏర్పాటు చేసి ఫోన్లు ట్యాప్ చేశారని కేకే మహేందర్ రెడ్డి ఆరోపించారు. సిరిసిల్ల వార్ రూం ఏర్పాటు వెనక కేసీఆర్,కేటీఆర్ హస్తం ఉందన్నారు కేకే మహేందర్ రెడ్డి. తన ఫోన్ తో పాటు.. మిగతా పార్టీనేతల ఫోన్లు ట్యాప్ చేశారన్నారు. ఫోన్ ట్యాపింగ్ కు పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు కేకే మహేందర్ రెడ్డి.కేకే మహేందర్ రెడ్డి వెంట..మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.

# నేను పక్కా లోకల్ మనిషిని

- ఇక్కడే పుట్టాను..ఇక్కడే పెరిగాను
- నటుడు బాబూమోహన్ వెల్లడి

**వరంగల్, ఏప్రిల్1(పీపుల్స్ మోటివేషన్):**

తాను పుట్టింది వరంగల్‌లోనేనని ప్రజాశాంతి పార్టీ తెలంగాణ అధ్యక్షుడు బాబు మోహన్ వెల్లడించారు. ఈ నగరంతో తనకు మంచి అనుబంధం ఉందన్నారు. హనుమకొండలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడారు. ఈ నగరానికి ఎప్పుడు వచ్చినా తన అడ్డా మాత్రం కరుణపురంలోనే అని ఆయన గుర్తు చేసుకున్నారు. ప్రజాశాంతి పార్టీ నుంచే తాను ఎంపీగా పోటీ చేస్తానని బాబూ మోహన్ స్పష్టం చేశారు. తాను వేరే పార్టీ నుంచి పోటీ చేస్తానని కొందరు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. చీప్ రాజకీయాలు చేయవద్దంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వరంగల్ ప్రజలు తనను గెలిపించాలని... అందరూ శెభాష్ అనేలా ప్రజలకు సేవ చేస్తానని తెలిపారు. సమాజానికి మంచి చేయాలనే ఉద్దేశంతోనే ఎన్నికల్లో పోటీ చేస్తున్నానన్నారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌లాగా తమ పార్టీ అధినేత కేఏ పాల్ అబద్దాలు చెప్పరన్నారు. టికెట్ ఇస్తామని చెప్పి బీజేపీ నేతలు మోసం చేశారని.. ఆ పార్టీ నేతల వ్యవహారశైలిపై మండిపడ్డారు. తాను గెలిచిన తర్వాత పేదలందరికీ పింఛన్లు ఇప్పిస్తానని.. అలాగే ఉచిత విద్య, వైద్య సదుపాయాలు కల్పిస్తానని బాబూ మోహన్ ప్రకటించారు.

# కెసిఆర్ ప్రజల్లోకి రాగానే కాళేశ్వరం నీరు వదిలారు








- ఇన్నాళ్లూ విమర్శలు చేస్తూ కాలయాపన చేశారు
- ముందే మేల్కొనివుంటే పంటలు కాపాడుకునే వారు
- నల్లగొండలో కెసిఆర్ పర్యటనల తరవాత ప్రజల్లో పునరాలోచన
- రేవంత్‌కు నల్లగొండ, ఖమ్మం నేతలతోనే ముప్పు
- పార్లమెంటరీ స్థాయి సమీక్షలో కెటిఆర్ విమర్శలు

**నల్లగొండ, ఏప్రిల్1(పీపుల్స్ మోటివేషన్):**

కాళేశ్వరంపై అవాకులు చవాకులు పేలిన వారే..కెసిఆర్ రైతల బాట పట్టడంతో నీళ్లు విడుదల చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. విమర్శించిన కాళేశ్వరమే నీళ్లు అందిస్తున్నదని అర్థం అయ్యిందన్నారు. ఈ పని ముందే చేసివుంటే రైతుల పంటలు కాపాడుకునే వారిమని అన్నారు. కాంగ్రెస్ పార్టీలోనే ఏక్‌నాథ్ షిండేలు ఉన్నారని.. నీ పక్కనే ఉన్న ఖమ్మం, నల్లగొండ బాంబులతోనే నీకు ప్రమాదం పొంచి ఉందని రేవంత్ రెడ్డిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. బీఆర్ఎస్ పార్టీతో రేవంత్‌కు ఎలాంటి ఇబ్బంది లేదని, ఈ ఐదేండ్లు ఆయనే పాలించి, హామీలు అమలు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లాలో ఏర్పాటు చేసిన నల్లగొండ పార్లమెంట్ విస్తృత స్థాయి సమావేశంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి వంద రోజులు గడుస్తున్నప్పటికీ రుణమాఫీ చేయలేదు. రైతుబంధు ఇవ్వలేదు.. కాంగ్రెస్ ప్రభుత్వం పై గ్రామాల్లో రైతులు కుతకుత ఉడుకుతున్నారు. రైతుబంధు అడిగితే చెప్పుతో కొట్టండి అని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అంటడు. చెప్పుతో కొట్టమన్న ఆయన అహంకారానికి ఓటు అనే ఆయుధంతో వేటు వేయండి. రైతుబంధు దుబారా అని ఉత్తమ్ కుమార్ రెడ్డి అంటుండు. అహంకారంగా మాట్లాడే ఈ జిల్లా నాయకులకు పార్లమెంట్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. రూ. 2 లక్షల రుణమాఫీ కావాలంటే, రూ. 15 వేల రైతుబంధు ఇవ్వాలంటే, వరి ధాన్యానికి బోనస్ రూ. 500 ఇవ్వాలంటే బీఆర్ఎస్‌కు ఓటేయాలి. కాంగ్రెస్‌కు ఓటేస్తే.. తాము ఏవీ అమలు చేయకున్నా.. మళ్లీ మాకే ఓటేశారని తప్పించుకు తిరుగుతారు. సీఎం రేవంత్ జేబులో కత్తెర పెట్టుకుని తిరుగుతున్నా అంటుండు. తనకు తెలిసి జేబు దొంగలు తిరుగుతారు ముఖ్యమంత్రులు తిరుగరని కేటీఆర్ తెలిపారు. పేగులు కట్ చేసి మెడలో వేసుకుంటా అంటుండు. అది ముఖ్యమంత్రి చేసే పనా.. అది బోటి కొట్టేడు చేసే పని. సెక్రటేరియట్‌లో లంకె బిందెలు ఉన్నాయకున్నా.. ఇక్కడ ఖాళీ బిందెలు ఉన్నాయి. అయినా లంకె బిందెల కోసం ఎవరు తిరుగుతారు.. అని కేటీఆర్ ప్రశ్నించారు. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెళ్లి నితిన్ గడ్కరీ వద్ద నేనొస్తా నేనొస్తా అని అంటున్నారట. రుణమాఫీ చేయ్. 18 ఏండ్లు నిండిన ప్రతి ఆడబిడ్డకు నెలకు రూ. 2500 ఇస్తానని చెప్పావు. రైతుబంధు రూ. 15 వేలు ఇస్తా అన్నావు.. దాని కోసం రైతలు ఎదురు చూస్తున్నారు. ఆటో డ్రైవర్లు రోడ్ల మీద పడి ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఉంది. ఆటో డ్రైవర్లకు నెలకు రూ. 10 వేలు ఇచ్చి ఆదుకోవాలి. దమ్ముంటే ఈ పనులు చేసి చూపించు అని కేటీఆర్ సవాల్ చేశారు. పొంకనాల పోతిరెడ్డి మాటలు విని ప్రజలు మోసపోయారు. నిజం నిలకడ మీదనే తెలుస్తుంది. ఇదే తెలంగాణ ప్రజలు ప్రేమతో, దయతో పదేండ్లు బీఆర్ఎస్‌కు అవకాశం ఇచ్చారు. బీఆర్ఎస్ పాలన స్వర్ణయుగాన్ని తలపించింది. ఇక బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటే.. బీజేపీకి బీ టీమ్ బీఆర్ఎస్ అని రాహుల్ గాంధీ నుంచి రేవంత్ దాకా మాట్లాడారు. ఇవాళ రాహుల్ మాట్లాడుతూ.. మోదీ దొంగ అంటడు. రేవంత రెడ్డేమో మోదీ మా పెద్దన్న అని అంటుండు. అదానీ ఫ్రాడ్ అని రాహుల్ అంటుంటే.. అదానీ మా ఫ్రెండ్ అని రేవంత్ అంటుండు. లిక్కర్ స్కాం లేదు.. కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం అన్యాయం అని రాహుల్ అంటుండు. లిక్కర్ స్కాం నిజమే. కవిత అరెస్టు కరెక్ట్ అని రేవంత్ అంటుండు. గుజరాత్ ఓ ఫేక్ మోడల్ అని రాహుల్ అంటడు.. తెలంగాణను గుజరాత్ మోడల్‌లా చేస్తా అని రేవంత్ అంటున్నాడు. రేవంత్ రాహుల్ కోసమా, మోదీ కోసమా పని చేసేది. ఒక్క ఓటు కాంగ్రెస్‌కు వేసినా అది బీజేపీకి పోతుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఇదే రేవంత్.. షెల్టర్, భవిష్యత్, కేసుల నుంచి బయటపడటం కోసం బీజేపీలో చేరుతారు. ఈ మాట పదిసార్లు అన్నాను. కానీ ఈ విషయంలో మాత్రం రేవంత్ స్పందించడం లేదని కేటీఆర్ పేర్కొన్నారు. కేసీఆర్ నిన్నటి పర్యటన వీడియోలు చూస్తే నల్గొండ జిల్లాలో ఎలా ఓడిపోయామో తెలియడం లేదని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పదేళ్ల నిజం ముందు వంద రోజుల అబద్దాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. మోసపోయినోళ్లు బీఆర్ఎస్ ఓటేయాలని.. రుణమాఫీ వచ్చినోళ్లు కాంగ్రెస్‌కు ఓటేయాలన్నారు. కరెంటు, నీళ్లు ఇవ్వక పోయినా, పంటలు ఎండినా కాంగ్రెస్‌కే ఓటు వేస్తే ఐదేళ్లు తప్పించుకుంటారన్నారు. తప్పు ప్రజలది కాదు. కేసీఆర్ మనల్ని నమ్ముకున్నాడు. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన మంచి పనులను ప్రజల్లోకి మనం తీసుకెళ్లలేకపోయాం. అందువల్లే అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయామని కేటీఆర్ తెలిపారు. తుంగతుర్తి, సూర్యాపేటలో కేసీఆర్ పర్యటన సందర్భంగా జనంలో ఆ ఎమోషన్ చూస్తుంటే.. అసలు నల్లగొండ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ ఎందుకు ఓడిపోయిందనేది అర్థం కాలేదు. ఓటమి గల కారణాలపై ఈ వంద పది రోజుల్లో వేల మందితో కూర్చొని మాట్లాడుకున్నాం. ఏం జరిగిందని విశ్లేషించుకున్నాం. నల్లగొండ, మిర్యాలగూడ, కోదాడ సభలకు హాజరైనప్పుడు.. ఆ జనాన్ని చూసి బీఆర్ఎస్ గెలుస్తుందని నమ్మాం. ర్యాలీలు, సభలకు వచ్చిన జనాలను, వారి ఉత్తేజాన్ని చూసిన తర్వాత నల్లగొండలో 12 లో 8 సీట్లు గెలుస్తామన్న విశ్వసాంతో ఉన్నాం. కానీ ఫలితాలు దానికి భిన్నంగా వచ్చాయన్నారు. మన మిత్రుడు భూక్యా జాన్సన్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత దాదాపు 45 నియోజకవర్గాల్లో ఓయూకు చెందిన 20 మంది విద్యార్థులతో సర్వే చేయించారు. ఆ సర్వేలో ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయని కేటీఆర్ తెలిపారు. మనం తప్పకుండా పార్టీ కుటుంబ సభ్యులుగా కేసీఆర్ బిడ్డలుగా ఆత్మ విమర్శ చేసుకోవాలి. మొన్న జరిగిన పొరపాట్లు పార్లమెంట్ ఎన్నికల్లో జరగకూడదు. పని చేసుకుంటూ వెళ్లిపోయాం.. కానీ ప్రభుత్వం చేసిన మంచి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లలేదు. ఎందుకంటే బీఆర్ఎస్ పాలనలో ఒక లక్షా 60 వేల 283 మంది పిల్లలకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చాం. ఈ దేశంలో ఈ పదేండ్లలో ఏ రాష్ట్రంలో కూడా ఇన్ని ఉద్యోగాలు ఇవ్వలేదు. అంటే దేశంలోనే అత్యధికంగా ఉద్యోగాల భర్తీ చేసి కూడా వాళ్ల మనసు గెలుచుకోవడంలో విఫలమయ్యాం. కేసీఆర్ పాలనలో ఇచ్చిన 30 వేల ఉద్యోగాలు నేనే ఇచ్చానని రేవంత్ రెడ్డి ఊదరగొడుతూ ఉపన్యాసాలు ఇస్తున్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చినాక ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు. పరీక్ష పెట్టలేదు. ఈ అబద్దాలను ప్రజలకు, యువతకు వివరించాలి. మనం ఉద్యోగాలిచ్చి కూడా చెప్పుకోలేకపోయాం. అయితే లంబాడీ తండాల్లోని కొంతమంది నిరుద్యోగులు తమకు ఉద్యోగాలు రాలేదు చెప్పారు. పెన్షన్లకు ఆశపడి ఓటు వేయకండి.. తమకు ఉద్యోగాలు వస్తే తామే అంతకు ఎక్కువ ఇస్తామని చెప్పి వృద్ధుల కాళ్లు మొక్కి నిరుద్యోగులు ఓట్లు వేయించారు. మరి లక్షా 60 వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు చెప్పడంలో విఫలమయ్యాం. ఇక గృహలక్ష్మి అనే పథకం ఎన్నికలకు ఏడాది ముందే అమలు చేసి ఉంటే.. ఓట్లు పడేవి అని విద్యార్థులు పేర్కొన్నట్లు సర్వేలో తేలినట్లు కేటీఆర్ చెప్పారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు 73 శాతం జీతం పెంచిన నాయకుడు కేసీఆర్. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కంటే ఎక్కువ జీతాలు ఇచ్చాం. కానీ ఉద్యోగులకు దూరమయ్యాం. ఒకటో తేదీన జీతం రాలేదని చెప్పి ఓట్లు వేయలేదు. కరోనాతో పాటు ఇతర సమస్యల వల్ల ఆర్థికంగా వెనుకబడ్డామని చెప్పడంలో విఫలమయ్యాం. రైతులకు కూడా దూరమయ్యాం. అలా ఏదో ఒక కారణంతో ఆయా వర్గాల ఓటర్లకు దూరమయ్యామని కేటీఆర్ తెలిపారు. ఎన్నో ఏండ్లుగా ఉన్న ఫ్లోరోసిస్ భూతాన్ని తరిమికొట్టాం. ఫ్లోరోసిస్ కాంగ్రెస్ ద్రోహమేనని ప్రజలకు చెప్పడంలో విఫలమయ్యాం. నల్లగొండ జిల్లాకు పదేండ్లలో మూడు మెడికల్ కాలేజీలు ఇచ్చామని చెప్పడంలో విఫలమయ్యాం. ఫెయిలైంది మన నాయకుడు కాదు.. తప్పు ప్రజలది కాదు. కేసీఆర్ మనల్ని నమ్ముకున్నాడు. మనమేమో ప్రజలకు చెప్పడంలో విఫలమయ్యాం. ప్రజలేమో అబద్దాలకు మోసపోయారు. పదేండ్ల నిజం ముందు ఈ వంద రోజుల అబద్దం ప్రజలకు ఇవాళ కనబడుతుంది. ఏ ఊరికి మన నాయకులు పోయినా ఇట్ల అయితదని అనుకోలేదు. ఇంత మోసం జరుగుతుది అనుకోలేదని. ఇవాళ ప్రజలు బాధపడుతున్నారు. కేసీఆర్ సార్ మళ్లీ నువ్వ రావాలి. నువ్వున్నప్పుడే మంచిగ బతికినం అని ఓ రైతు కన్నీరు పెట్టుకున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. కాంగ్రెస్ పాలన ప్రజలకు అర్థమైంది.. మనకు అర్థం కావాలి. మనం గట్టిగా పని చేస్తే ఫలితం వస్తుంది. 2018లో జిల్లా మొత్తంలో 12కి 11 గెలిచాం. నల్లగొండ పార్లమెంట్‌లో 6 గెలిచాం. కానీ పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ, భువనగిరి స్థానాల్లో ఓడిపోయాం. ఇప్పుడు 11 సీట్లు గెలిచిన కాంగ్రెస్ పార్టీ ఈ రెండు ఎంపీ నియోజకవర్గాల్లో ఎందుకు ఓడదో ఆలోచించి పని చేయండి. బీజేపీ, కాంగ్రెస్ రాజకీయాలను ప్రజలను సునిశితంగా గమనిస్తున్నారు అని కేటీఆర్ తెలిపారు.

తెలుగు దినపత్రిక

# పీపుల్స్ మోటివేషన్

People's Motivation

మంగళవారం । ఏప్రిల్ । 2 । 2024

జనరల్ న్యూస్ 07

# వలంటీర్ల సంచలన నిర్ణయం

- మచిలీపట్నంలో 12వందల మంది రాజీనామా
- ఇసి నిబంధనలకు తోడు..రాజకీయ విమర్శలపై ఆగ్రహం
- వైకాపా తరపున ప్రచారం చేస్తారని సమాచారం

**మచిలీపట్నం, ఏప్రిల్1(పీపుల్స్ మోటివేషన్):**

కృష్ణాజిల్లా మచిలీపట్నంలో మహిళా వాలంటీర్లు కీలక నిర్ణయం తీసుకున్నారు. తమ పోస్టులకు వారు రాజీనామా చేశారు. నియోజకవర్గంలో సంక్షేమపథకాలను లబ్దిదారులకు అందజేస్తున్న 1200 మంది వాలంటీర్లు ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే వీరంతా వైసిపికి అనుకూలంగా ప్రచారం చేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. 50 నెలలుగా అర్హులైన వారందరికి సంక్షేమ పథకాలను నిస్వార్ధంగా అందిస్తున్నామని రాజీనామా లేఖలో తెలిపారు. ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లకు లోనుకాకుండా తమ విధులను నిర్వహిస్తున్నామన్నారు. అయినా కొంతమంది తమ సేవలకు రాజకీయాలు ఆపాదించి.. వేధిస్తున్నారని వాలంటీర్లు ఆరోపించారు. ఈ క్రమంలో మచిలీపట్నం నియోజకవర్గంలో 1200 మంది మహిళా వాలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామా చేసేశారు. నాలుగున్నరేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం తరపున సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నామని తెలిపారు. అవినీతికి ఆస్కారం లేకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్నారు. వాలంటీర్లు అనితరమైన సేవలు అందిస్తున్న వాలంటీర్లను .ఎన్నికల నేపథ్యంలో పెన్షన్ల పంపిణీకి ఈసీ దూరం చేసినందుకు మనస్థాపంతో రాజీనామా చేసినట్లు తెలిపారు. మచిలీపట్నం మున్సిపల్ కమిషనర్‌కు తమ రాజీనామా పత్రాలను సమర్పించారు. కొంతమంది వాలంటీర్లు గ్రామ సచివాలయాల్లో తమ రాజీనామా పత్రాన్ని సమర్పించారు. కొంతమంది రాజకీయ నేతలు కక్ష సాధింపు చర్యగా... . ఎలక్షన్ కమిషన్ కు ఫిర్యాదు చేయడం, హైకోర్టుకు వెళ్లడం ద్వారా వాలంటీర్ వ్యవస్థను తీసివేయాలని కుట్రలు చేశారు. వాలంటీర్లపై . నిందలు వేశారు. కోవిడ్ సమయంలో వాలంటీర్లు చేసిన సేవలను మర్చిపోయిన దుర్మార్గులు ... 1వ తేదీన పెన్షన్ల కోసం ఎదురు చూస్తున్న వృద్ధులు, పేదల ఆశలపై గొడ్డలి వేటు వేశారు. నియోజకవర్గంలో మొత్తం 1200 పైబడి వలంటీర్లు సేవలందిస్తున్నారు. త వలంటీర్ల మూకుమ్మడి రాజీనామాలపై కమిషనర్ బాపిరాజు స్పందించారు. మచిలీపట్నంలో వార్డు వలంటీర్ల మూకుమ్మడి రాజీనామాలను పరిశీలిస్తున్నామన్నారు. నగర పాలక సంస్థలో 823 మంది వలంటీర్ల పోస్టులు ఉండగా.. అందులో 10- 15 పోస్టులు ఖాళీగా ఉన్నాయని అన్నారు. ఇప్పటి వరకు 430 మంది నుంచి రాజీనామాలు అందాయని తెలిపారు. రాజీనామాలన్నింటినీ పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని బాపిరాజు వెల్లడించారు. వలంటీర్లతో సామాజిక పింఛన్లు పంపిణీ చేయించొద్దని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. ఎన్నికల విధుల నుంచి వలంటీర్లను దూరంగా ఉంచాలని మరోసారి స్పష్టం చేసింది. కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయాలను రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేశ్ కుమార్ మీనా తాజాగా ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయ వలంటీర్లను పెన్షన్ పంపిణీ కార్యక్రమం నుంచి దూరం పెట్టాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించినట్లు వెల్లడించారు. వలంటీర్ల ద్వారా లబ్దిదారులకు ఎటువంటి పథకాలు, పింఛన్, నగదు పంపిణీ చేయకూడదని ఎన్నికల సంఘం స్పష్టం చేసిందని తెలిపారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని కేంద్ర ఎన్నికల సంఘం సీఈవోకు పంపిన ఆదేశాల్లో స్పష్టం చేసింది. ఎన్నికల కోడ్ ముగిసే వరకు వలంటీర్లకు ఇచ్చిన ట్యాబ్, మొబైల్‌తో పాటు ఇతర ఉపకరణాలు కలెక్టర్ల వద్ద డిపాజిట్ చేయించాలని ఈసీ ఆదేశించినట్లు మీనా తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం కొనసాగిస్తున్న పథకాలను, నగదు పంపి ణీ పథకాలను ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా, ప్రత్యేకించి ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా అమలు చేయాలని ఈసీ సూచించినట్లు వెల్లడించారు.

## కాంగ్రెస్ పాలనతో మోడీ పాలనను పోల్చుకోండి

- దేశంల ఎంతగా పురోగమించిందో గమనించండి
- మోడీ వచ్చాకనే ప్రపంచంలో గుర్తింపు వచ్చింది
- దేశ అభివృద్ధి కోసం బిజెపికి ఓటేయాలి
- ఓటర్లను కోరిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



**హైదరాబాద్, ఏప్రిల్1(పీపుల్స్ మోటివేషన్):**

గత కాంగ్రెస్ పాలనతో 10 ఏళ్ల మోడీ పాలనను పోల్చుకుని బిజెపికి ఓటేయాలని తెలంగాణ బిజెపి అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ఓటర్లను కోరారు. మోడీ వచ్చాక 500 ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న సమస్యలను పరిష్కరించారన్నారు. మహిళలకు 33 శాతం కోటా ఇచ్చారని, హైవేలు నిర్మించారని, వ్యవసాయ వృద్ధికి సాయమందించారని, అనేక సంక్షేమ పథకాలు అమలుచేశారని అన్నారు. ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ అనేక అంశాలపై మాట్లాడారు. వారు పేదలకు బ్యాంకు ఖాతాలు ఎందుకు అని హేళన చేశారన్నారు. ప్రస్తుతం పేదలు దాదాపు రూ. 2 లక్షల కోట్లు పొదుపు చేశారు. గతంలో నిరర్ధక ఆస్తులు చాలా ఉండేవి. బిజెపి ప్రభుత్వం వచ్చాక 55 కోట్ల కొత్త బ్యాంకు ఖాతాలు ఇచ్చామన్నారు.కాంగ్రెస్ హయాంలో ద్రవ్యోల్బణం 12శాతానికి పైగా ఉండేదన్నారు. బీఆర్ఎస్ పార్టీ అత్యంత వేగంగా పతనం అవుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎన్టీపీసీ విద్యుత్ ప్లాంట్ నిర్మాణానికి కేసీఆర్ హకరించలేదన్నారు. ప్రారంభోత్సవానికి మాత్రమే కేసీఆర్ వచ్చారని తెలిపారు. ఆ తర్వాత ఎప్పుడూ కేసీఆర్ దానిని పట్టించుకోలేదని విమర్శించారు. తండ్రీ, కొడుకులతోనే తెలంగాణ నాశనమయిందని వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్‌ను చూసి జాలిపడాలన్నారు. ఓటమి తర్వాత కూడా ఆయన సీఎం అయినట్టు ఫీల్ అవుతున్నారని అన్నారు. పదేళ్లుగా దేశంలో చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలపైనే బీజేపీ ప్రచారం ఉంటుందని వెల్లడించారు. సీఎం కావాలనుకున్న కేటీఆర్ ఆశలయ అడియాశలు అయ్యాయన్నారు. అవినీతి ఆరోపణలు లేకుండా మోదీ పాలన సాగిందని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ పార్టీ పాలనలో కేవలం ప్రకటనలకే పరిమితం అయ్యిందన్నారు. ప్రజల బ్రతుకులు మారలేదన్నారు. తాత్కాలికంగా ఓట్లు పొందేందుకే కాంగ్రెస్ పార్టీ ప్రయత్నం చేసిందని విమర్శించారు. ప్రపంచానికే సాయం చేసే స్థాయికి భారత్ ఎదిగిందన్నారు. సంక్షేమం కోసం 34 లక్షల రూపాయలు ఖర్చు చేసింది మోదీ ప్రభుత్వమని తెలిపారు. దేశంలో డిజిటల్ విప్లవం తీసుకుని వచ్చామమని.. జీఎస్టీ వ్యాపారస్తులకు వరంగా మారుతోందన్నారు. 1.66 లక్షల కోట్ల రూపాయలు ప్రతి ఏటా జీఎస్టీ ద్వారా దేశానికి ఆదాయం వస్తుందన్నారు. 26,500 కోట్ల డిజిటల్ ట్రాన్జక్షన్స్ దేశవ్యాప్తంగా జరిగాయన్నారు. ఎంఎస్ఎంఈల ద్వారా పెద్ద ఎత్తున ఉద్యోగాలు వచ్చాయన్నారు. జనధన్ ఖాతాలతో 2 లక్షల కోట్ల రూపాయలు నేడు వారి సేవింగ్స్ అకౌంట్‌లలో జమ చేసుకున్నారన్నారు. పన్ను రాయితీ 7 లక్షల రూపాయలకు పెంచింది మోదీ ప్రభుత్వమని చెప్పారు. హైదరాబాద్ మెట్రోకు 12 వేల కోట్ల రూపాయలు ఆర్థిక సాయం చేసిందన్నారు. జాతీయ రహదారుల నిర్మాణంతో ప్రమాదాలు తగ్గిపోయాయన్నారు. 20 వేల కిలోమీటర్ల మేర రైల్వే లైన్‌లకు విద్యుదీకరణ పూర్తి అయ్యిందన్నారు. రోడ్ నెట్వర్క్‌లో ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉన్నామన్నారు. 101 దేశాలకు కరోనా వ్యాక్సిన్ అందజేశామని.. 411 కంపెనీలు దేశంలో సెల్‌ఫోన్ ఉత్పత్తి చేస్తున్నాయని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

## మోడీ ఫోటో పెట్టుకుంటే గెలవలేరు

- అందుకే రామజపం చేస్తున్న బిజెపి
- కరీంనగర్ అభివృద్ధికి బండి చేసిందేమీ లేదు
- మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శలు

**సిద్ధిపేట, ఏప్రిల్1(పీపుల్స్ మోటివేషన్):**

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ నేతలు ప్రధాని మోదీ ఫొటోతో గెలిచే పరిస్థితిలో లేరని..అందుకనే అయోధ్య రాముడి ఫొటోతో ప్రచారం చేసుకుంటున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రామజపం చేస్తున్న తీరే ఇందుకు నిదర్శనమని అన్నారు. రాముడు అందరివాడన్నారు. 5 ఏళ్లలో కరీంనగర్ జిల్లా అభివృద్ధికి ఎంపీ బండి సంజయ్ ఏమి చేశారో చెప్పాలని ప్రశ్నించారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు చాలా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టానని చెప్పారు. తాను జిల్లాను ఎలా చేశానో ప్రజల అందరికీ తెలుసునని చెప్పారు. సోమవారం నాడు కోహెడ మండలంలోని శనిగరం పెద్ద చెరువును ఆకస్మికంగా సందర్శించారు. శనిగరం గ్రామంలో తాగు నీటి ఎద్దడి లేకుండా చూడాలని , అక్కడ అవసరమైన బోర్ వెల్స్ వేసుకోవడంతో పాటు అదనపు మోటార్లు ఏర్పాటు చేసుకోవాలని గ్రామ సెక్రెటరీతో పాటు స్పెషల్ ఆఫీసర్లకు మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే లోపు పాఠశాలల్లో తరగతి గదులకు కలర్స్ వేయడంతో పాటు టాయిలెట్స్ నిర్మాణం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎండాకాలంలో ఈసారి ముందుగానే భూగర్భ జలాలు పడిపోయాయన్నారు. కాంగ్రెస్ (అనీనిణసుబబ) కరువు తెచ్చిందని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అంటున్నారని.. కానీ బీఆర్ఎస్ తెచ్చిన కరువు ఇదని ఎద్దేవా చేశారు. గ్రామానికి , మండలానికి, నియోజకవర్గానికి సంబంధించిన ప్రజలకు ఏ సమస్య వచ్చిన తాను 24గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. ఎన్నికలు అయిపోయిన తర్వాత ప్రతి గ్రామగ్రామాన పర్యటించి సమస్యలు పరిష్కరిస్తానని అన్నారు. కొంతమంది భూ పంచాయతీలల్లో తనను ఇన్వాల్వ్ చేస్తున్నారని.. వారికి మంత్రి పొన్నం ప్రభాకర్ స్టాం÷-రగ్ వార్నింగ్ ఇచ్చారు.

## వైసిపి ఒత్తిడి మేరకే వలంటీర్ల రాజీనామా

- రాజకీయ లబ్ధి పొందే మైండ్ గేమ్
- రాజీనామాలపై కొల్లు రవీంద్ర విమర్శలు

**మచిలీపట్నం, ఏప్రిల్1(పీపుల్స్ మోటివేషన్):**

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామాలపై టీడీపీ నేత కొల్లు రవీంద్ర సంచలన వ్యాఖ్యలు చేశారు. మూకుమ్మడి రాజీనామాలతో వలంటీర్ల నిజస్వరూపం బయట పడిందన్నారు. కేవలం సీఎం జగన్ రాజకీయంగా వాలంటీర్లను వాడుకునేందుకు మూకుమ్మడి రాజీనామాలు చేయిస్తున్నారని విమర్శించారు. రాజీనామాలు చేయాలని స్థానిక వైసీపీ నేతలు వాలంటీర్లపై ఒత్తిడి తెచ్చారన్నారు.ఈసీ నిర్ణయానికి వ్యతిరేకంగా వాలంటీర్లు వెళు తున్నారని.. వలంటీర్లను తొలగించమని ఈసీ చెప్పలేదని అన్నారు. కేవలం పెన్షన్ల పంపిణీకి మాత్రమే వలంటీర్లను దూరం పెట్టిందని చెప్పుకొచ్చారు. చంద్రబాబు కూడా వలంటీర్లను కొనసాగిస్తామన్నారే గానీ తొలగిస్తామని ఎక్కడా చెప్పలేదన్నారు. ప్రత్యేక ఫార్మెట్ తయారు చేసి ఆ ఫార్మెట్ ప్రకారం రాజీనామాలు చేయిస్తున్నారన్నారు. వలంటీర్ల రాజీనామాలను ఆమోదించవద్దని అధికారులను కోరుతున్నామన్నారు. ఈసీ కూడా దీనిపై దృష్టి పెట్టి మూకుమ్మడి రాజీనామాలకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని కొల్లు రవీంద్ర కోరారు. ÷ూగా.. మచిలీపట్నంలో వలంటీర్ల మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తున్నారు. పెన్షన్ల పంపిణీకి వలంటీర్లను ఈసీ దూరం పెట్టింది. దీంతో మున్సిపల్ కమిషనర్‌కు.. అలాగే గ్రామ సచివాలయాల్లోనూ వలంటీర్లు రాజీనామాలను అందిస్తున్నారు. నియోజకవర్గంలో మొత్తం 1200 పైబడి వలంటీర్లు సేవలందిస్తున్నారు. ఇక రాజీనామా లేఖలో వలంటీర్లు పేర్కొన్న అంశాలు.. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులకు అందిస్తూ గత 50 నెలలుగా నిస్వార్ధ సేవలందిస్తున్నామన్నారు. ఎటువంటి రాజకీయాలకూ ప్రభావితం కాకుండా సేవలందిస్తున్నామని తెలిపారు. కొంతమంది తమ సేవలకు రాజకీయాలు ఆపాదించి తమపై ఈసీకి ఫిర్యాదు చేశారన్నారు. దీనికి తామంతా మనస్థాపానికి గురై రాజీనామా చేస్తున్నామని వలంటీర్లు తెలిపారు.

## కడియం రాజీనామా చేసి మాట్లాడాలి

- పార్లమెంట్ ఎన్నికల్లో కడియంకు గట్టి బుద్ధి చెప్పాలి
- ఎన్నో విధాలుగగా ఆదుకున్న పార్టీకి ద్రోహం చేసి వెళ్లాడు
- దొంగ అన్న రేవంత్‌తోనే కండువా కప్పించుకోవడం సిగ్గుచేటు
- వరంగల్ పార్లమెంటరీ స్థాయి సమావేశంలో హరీష్ రావు విమర్శలు

**వరంగల్, ఏప్రిల్1(పీపుల్స్ మోటివేషన్):**

స్టేషన్ ఘన్‌పూర్ నుంచి అసెంబ్లీకి ఎన్నికైన కడియం శ్రీహరి తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో కడియం శ్రీహరికి గట్టిగా గుణపాఠం చెప్పాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. వరంగల్ పార్లమెంట్ విస్తృత స్థాయి సమావేశంలో హరీశ్‌రావు పాల్గొని ప్రసంగించారు. కడియం శ్రీహరి బీఆర్ఎస్‌ను వీడిన తర్వాత కార్యకర్తల్లో జోష్ ఎక్కువగా కనబడుతోంది. కసి ఎక్కువగా కనబడుతోంది. స్టేషన్ ఘన్‌పూర్ ఉప ఎన్నికలో పని చేసిన ఉత్సాహం ఇవాళ మీలో కనబడుతోంది. పార్టీకి ద్రోహం చేసిన కడియం శ్రీహరికి గట్టిగా గుణపాఠం చెప్పాలనే కసి కార్యకర్తల్లో కనబడుతుంది. ఆయన బిడ్డకు ఎంపీ టికెట్ తీసుకుని, అందరితో సమావేశాలు పెట్టించి చివరి క్షణంలో పార్టీ మారారు. ఇలాంటి ద్రోహులకు గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు హరీశ్‌రావు. పార్టీ మారడమంటే కార్యకర్తల మనోస్థైరాన్ని దెబ్బతీయడం, పార్టీని అవమానపరచడమేనని హరీశ్‌రావు పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీలో శ్రీహరికి ఏం తక్కువ చేయలేదు. డిప్యూటీ సీఎంగా, ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీ, ఎంపీగా అవకాశాలు ఇచ్చింది పార్టీ. ఆయన జీవితాంతం రుణపడి ఉన్న కూడా పార్టీకి తక్కువే. పార్టీ మారేది లేదు.. బీఆర్ఎస్‌లోనే ఉంటానని పలు వేదికలపై చెప్పారు. అవసరమైతే రాజకీయాల నుంచి తప్పుకుంటాను కానీ పార్టీ మారనని పలు ఇంటర్వ్యూల్లో చెప్పారు. ఇప్పుడు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. నీతి, నిజాయితీ, విలువలు ఉంటే.. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నామని హరీశ్‌రావు పేర్కొన్నారు.పలు సందర్భాల్లో కడియం శ్రీహరి రేవంత్ రెడ్డిని దొంగతో పోల్చారు. సెక్రటేరియట్‌లో లంకె బిందెలు ఉన్నాయనకున్న రేవంత్ మాటలకు కడియం కౌంటర్ ఇచ్చారు. రేవంత్ ఓ దొంగ అని తీవ్ర విమర్శలు చేసిన కడియం.. ఇవాళ అదే దొంగతో కాంగ్రెస్ కండువా కప్పించుకున్నాడు. ఈ వయసులో ఇంత దిగజారుడు రాజకీయాలు అవసరమా..? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. కేసీఆర్ తెలంగాణ ఉద్యమం ప్రారంభించిన నాడు పట్టుమని పది మంది లేరు. జయశంకర్ సార్ దీవెనతో ఉద్యమాన్ని ప్రారంభించి, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారు కేసీఆర్. కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ తప్పకుండా అధికారంలోకి వస్తుంది. చరిత్ర చూస్తే కాంగ్రెస్ గవర్నమెంట్ ఏ రాష్ట్రంలో కూడా ఐదేండ్లు కంటే ఎక్కువ లేదు. ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో ఐదేండ్లు మాత్రమే ఉంది. హిమాచల్ ప్రదేశ్‌లో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి ఉందన్నారు హరీశ్‌రావు. రాష్ట్రంలోని బీజేపీ నేతలకు హరీశ్‌రావు చురకలంటించారు. వీళ్లే భక్తులు అన్నట్టు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. మనం కూడా దేవుళ్లను పూజిస్తామని, తాను రెండు నిమిషాల్లోనే హనుమాన్ చాలీసా చదివేస్తానని హరీశ్‌రావు తెలిపారు. వరంగల్ పార్లమెంట్ విస్తృత స్థాయి సమావేశంలో హరీశ్‌రావు పాల్గొని ప్రసంగించారు. పదేండ్ల బీజేపీ పాలనలో తెలంగాణకు చేసిందేమీ లేదు. బీజేపీ మాట వింటే జోడి.. వినకపోతే తెల్లారి ఈడీ.. ఇది ఇవాళ ఈ దేశంలో రాజకీయ పరిస్థితి. విదేశాల్లో నల్లధనం తెస్తామని, ఒక్కొక్కరి అకౌంట్‌లో 15 లక్షలు వేస్తామన్నారు. 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్నారు. ఇప్పటి వరకు 20 కోట్ల ఉద్యోగాలు ఇవ్వాలి. ఈ పదేండ్లలో ఒక కోటి ఉద్యోగాలు కూడా ఇవ్వకుండా నిరుద్యోగులను మోసం చేశారు. నల్లచట్టాలు తెచ్చి రైతులను పొట్టన పెట్టుకుంది బీజేపీ ప్రభుత్వం. పెట్రోల్, డిజీల్ ధరలు పెంచారు. బీజేపీ పాలనలో ఈ దేశంలో ఆకలి, పేదరికం, నిరుద్యోగం పెరిగింది. బీజేపీ పాలనలో సీబీఐ, ఈడీ కేసులు మాత్రం పెరిగాయని హరీశ్‌రావు మండిపడ్డారు.బీజేపోళ్లు ఏమన్న అంటే రామాలయం అంటారు. రాముడిని అందరం మొక్కుతాం. మనం కూడా హనుమాన్ చాలీసా చదువుతాం. బీజేపోళ్లకు వస్తదో.. రాదో తెల్వదు కానీ.. తాను హనుమాన్ చాలీసా రెండు నిమిషాల్లో చదువుతాను. హనుమాన్ చాలీసా చదవనిదే, పూజ చేయనిదే బయటకు వెళ్లం. దేవుడు అందరివాడు. బీజేపోళ్లకు మాత్రమే దేవుడు అన్నారని అనుకుంటారు. అద్భుతమైన యాదాద్రి కట్టారు కేసీఆర్. మనం కూడా అక్షింతలు పంచినట్టు.. ఇంటికో యాదాద్రి లడ్డూ పంచి రాజకీయాలు చేయలేదు. రాజకీయాలకు దేవుళ్లను వాడుకోలేదు. బీజేపీ నాయకులు చేసింది ఏం లేదు కాబట్టి మతం పేరిట రాజకీయాలను చేస్తున్నారు. జాతీయ పార్టీలకు గులాం గిరి చేసేవాళ్లు కావాల్నా.. తెలంగాణ గళం వినిపించే వాళ్లు కావాల్నా ఆలోచించాలి అని వరంగల్ ప్రజలకు హరీశ్‌రావు సూచించారు.

## కాళేశ్వరం కట్టిన ఎల్ అండ్ టి ని అడగండి

- మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

**హైదరాబాద్, ఏప్రిల్1(పీపుల్స్ మోటివేషన్):**

కాళేశ్వరం ప్రాజెక్టును కట్టింది ఎల్‌అండ్ టీ నిర్మాణ సంస్థ అని, నిర్మాణ లోపాలుంటే వెళ్లి ఆ సంస్థను అడగాలని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఎన్ని ప్రాజెక్టులను కట్టిన ఘనత ఆ సంస్థకు ఉందన్నారు. నిర్మాణ లోపాలు ఉంటే దానిని అడిగి తెలుసుకోవాలన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎల్‌అండ్ టీ సంస్థ దేశంలోని అనేక ప్రాజెక్టులు నిర్మించిందని అన్నారు. లోపాలుంటే ఆ సంస్థను ప్రశ్నించాలని అధికార పక్షానికి సూచించారు. కాంట్రాక్టర్లు, అధికారుల వల్ల ప్రాజెక్టులో లోపం జరిగి ఉండవచ్చన్నారు. నాలుగు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పర్యటించిన ఏకైక ప్రాజెక్టు కాళేశ్వరమని అన్నారు. ప్రభుత్వం పెండింగ్ ప్రాజెక్టులపై దృష్టి పెట్టాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ బాగుందన్నట్టు కాంగ్రెస్ నేతల స్టేట్ మెంట్లు ఉంటున్నాయని చెప్పారు. ప్రతి పక్ష నేత హోదాలో కేసీఆర్ ప్రజల్లోకి వెళ్తారని, ఆయన పర్యటనలు తప్పుపట్టడం కరెక్ట్ కాదని చెప్పారు. కాంగ్రెస్ ఎన్నిరోజులు ఉంటుందో బీఆర్ఎస్ కూడా అన్ని రోజులే ఉంటుందన్నారు.


తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation



## కలెక్షన్లలో దూసుకుపోతున్న
# టిల్లు స్క్వేర్



టాలీవుడ్ యువ హీరో సిద్దు జొన్నలగడ్డ కాంపౌండ్ నుంచి వచ్చిన ప్రాజెక్ట్ డీజే టిల్లు సీక్వెల్ ప్రాజెక్ట్ టిల్లు స్క్వేర్ ఇటీవలే దిడుదలై మంచి టాక్ తెచ్చుకుంది. బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లతో దూసుకెళ్తుంది. నరుడా డోనరుడా ఫేం మల్లిక్‌రామ్ డైరెక్ట్ చేసిన ఈ చిత్రం మార్చి 29న విడుదలై ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేస్తోంది. ఈ చిత్రం ఓపెనింగ్ వీకెండ్‌లో రూ.68.1 కోట్లు వసూళ్లు రాబట్టి.. రూ.50 కోట్ల క్లబ్‌లోకి ఎంటరయ్యే దిశగా వెళ్తుంది. మూడు రోజుల థ్రియాట్రికల్ జర్నీలో కలెక్షన్ల విషయంలో నైజాం ఏరియా కీలక పాత్ర పోషించిందనే ట్రేడ్ విశ్లేషకుల అంచనా. ఆదివారం ఒక్కరోజే టిల్లు 2 నైజా ఏరియాలో రూ.3.30 కోట్లు రాబట్టింది. నైజాంలో మూవీ మొత్తం వసూళ్లు రూ.10.50 కోట్లు.. ఓ వైపు ఐపీఎల్ మేనియా కొనసాగుతున్నా ఓపెనింగ్ వీకెండ్‌లో రూ.10 కోట్ల క్లబ్‌లోకి చేరిపోయి తన స్టామినా ఏంటో మరోసారి రుజువు చేస్తున్నాడు సిద్దు జొన్నలగడ్డ. టిల్లుకు మాస్ ఆడియెన్స్ ఏ రేంజ్ లో కనెక్ట్ అయ్యారో తాజా వసూళ్లు చెప్పకనే చెబుతున్నాయి. ఈ మేనియా ఇలాగే కొనసాగితే టిల్లు 2 అతి త్వరలోనే రూ.100 కోట్ల క్లబ్‌లోకి ఎంటరవడం పక్కా అని అర్థమవుతోంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్‌తో అసోసియేట్ అవుతూ నిర్మించిన ఈ మూవీకి రామ్ మిర్యాల సంగీతం అందించాడు. ఈ చిత్రంలో మురళీధర్ గౌడ్, ప్రణీత్ రెడ్డి ఇతర కీలక పాత్రల్లో నటించారు.క్లైమాక్స్ షాకింగ్‌గా ఉండటమే కాదు.. ప్రేక్షకులంతా స్టన్ అవడం గ్యారంటీ అని సిద్దు ముందుగా చెప్పినట్టుగానే ఆ మ్యాజిక్‌ను రిపీట్ చేసినట్టు ఇప్పటివరకు వచ్చిన టాక్ చెబుతోంది.



# కిందికి లాగాలని ప్రయత్నించేవారూ ఉన్నారు

బాలీవుడ్‌లో ముక్కుసూటిగా మాట్లాడే నటీమణుల్లో రవీనా టాండన్ ఒకరు. తను అగ్ర నటిగా ఉన్ననాటి సమయం.. అప్పటి రాజకీయాలు.. బాలీవుడ్ సంప్రదాయాలు.. ఇలా పలు విషయాలపై తాజాగా ఓ ఛానెల్లో మాట్లాడారు. '90లలో నటీనటుల మధ్య పోటీ తీవ్రంగా ఉండేది. సెట్లో వాతావరణ ఆహ్లాదకరంగా ఉండేది. హీరోహీరోయిన్ల నటన, అ్గ÷ర్లు, వివాదాల గురించి చెప్పుకుంటూ ఒకర్నొకరు ఆట పట్టించుకునేవారు. అంతవరకైతే ఫర్వాలేదు. కొన్నిసార్లు ఇది శృతి మించి పోయేది. తమ కెరీర్ పట్ల అభద్రతా భావంతో ఉండేవాళ్లు, ఇతరుల విజయాన్ని ఓర్వలేకపోయేవాళ్లు కొందరు ఇతరుల్ని కిందికి లాగాలని ప్రయత్నించేవాళ్లు. దానికోసం వాళ్ల బాయ్‌ఫ్రెండ్ లేదా గర్ల్‌ఫ్రెండ్‌ని ప్రయోగించేవాళ్లు. పరిశ్రమలో పోటీ ఉండటం సహజమే కానీ ఇదేం పద్ధతి? గాసిప్స్, అనవసర రాజకీయాలతో పాపులర్ కావాలనుకోవడం ఏంటి? కొన్నిసార్లు ఇలాంటి పరిస్థితి నేనూ ఎదుర్కొన్నా. అయితే నాకు తెలిసి ఉద్దేశపూర్వకంగా ఎవరితో ఇలా ప్రవర్తించలేదు. ఎవరి మనసూ గాయపరచలేదు. ఎవరినీ సినిమాలోంచి తీసేయించాలని ప్రయత్నించలేదు. నాకు తెలియకుండా అలా జరిగితే క్షమాపణ చెప్పడానికి ఇప్పటికీ సిద్ధమే' అని చెప్పుకొచ్చారు.

# ప్రైవేట్ ఫంక్షన్‌లో స్టెప్పులేసిన రాజమౌళి

దర్శకధీరుడు ఎస్ఎస్ రాజమౌళి గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. తెలుగు సినిమాను పాన్ ఇండియా లెవెల్‌కు తీసుకెళ్లిన ఘనత ఆయనకే దక్కుతుంది. అయితే, జక్కన్నలో మరో టాలెంట్ ఉందని ఇప్పుడే తెలిసింది. ఇటీవలే జరిగిన ఓ ఫ్యామిలీ ఫంక్షన్‌లో స్టెప్పులేసి అందరినీ ఆశ్చర్యపరిచారు అది కూడా తన భార్య రమా రాజమౌళితో కలిసి స్టేజ్‌పై సందడి చేశారు. 'ప్రేమికుడు' సినిమాలోని ఏఆర్ రెహమాన్ కంపోజ్ చేసిన 'అందమైన ప్రేమరాణి..' అంటూ సాగే హిట్ పాటకు అదిరేలా స్టెప్పులేసి అందరినీ ఆకట్టుకన్నాడు. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట తెగ వైరల్ అవుతోంది. ఈ డ్యాన్స్ వీడియో సినీ ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటోంది. జక్కన్న డ్యాన్స్ వీడియో చూసిన నెటిజన్లు, సినీ ప్రియులు 'మీలో ఈ టాలెంట్ కూడా ఉందా..?' అంటూ ఆశ్చర్యపోతున్నారు. ఇండస్ట్రీలో ఓటమి ఎరుగని దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న రాజమౌళి.. బాహుబలి, ఆర్‌ఆర్‌ఆర్ లాంటి హిట్ సినిమాల తరువాత మహేశ్‌తో ఎంబి29 తో బిజీగా మారాడు. టాలీవుడ్ సూపర్‌స్టార్ మహేశ్‌బాబు హీరోగా తెరకెక్కనున్న ఈ సినిమా ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులను పూర్తిచేసుకుంటోంది. రాజమౌళి ప్రతి సినిమాకు తన భార్య రమానే కాస్ట్యూమ్ డిజైనర్ అన్న విషయం తెలిసిందే.

# సల్లూభాయ్-మురుగదాస్ కాంబో

**విలన్‌గా విద్యుత్ జమ్వాల్**

ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో ఉన్న మోస్ట్ టాలెంటెడ్ డైరెక్టర్లలో టాప్‌లో ఉంటాడు ఏఆర్ మురుగదాస్ ఈ స్టార్ డైరెక్టర్ కాంపౌండ్ నుంచి సినిమా వస్తుందంటే అంచనాలు భారీగానే ఉంటాయి. ఈ స్టార్ డైరెక్టర్ బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్‌తో సినిమా చేస్తున్నాడని తెలిసిందే. ఈ సినిమా పూర్తి చేసే కంటే ముందు మురుగదాస్ శివకార్తికేయన్‌తో చేస్తున్న ప్రాజెక్ట్ పూర్తి చేయాల్సి ఉంది. ఇంకా టైటిల్ ఫిక్స్ కానీ సల్లూభాయ్-మురుగదాస్ కాంబో సినిమాపై ఆసక్తికరవార్త నెట్టింట హల్ చల్ చేస్తోంది. ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ యాక్టర్ విద్యుత్ జమ్వాల్ విలన్‌గా కనిపించబోతున్నాడట. ఒకవేళ ఈ వార్త నిజమైతే మురుగదాస్-విద్యుత్‌జమ్వాల్ కాంబోలో 12 ఏండ్ల గ్యాప్ తర్వాత రాబోతున్న రెండో సినిమా కానుంది. మరి మురుగదాస్-విద్యుత్ జమ్వాల్ కలయికలో రాబోతున్న సినిమా గురించి మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. శాండల్‌వుడ్ రుక్మిణి వసంత్ ఈ చిత్రంలో ఫే మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. శ్రీలక్ష్మి మూవీస్ పై ఎన్వీ ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి కోలీవుడ్ స్టార్ కంపోజర్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండటంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. గతేడాది టైగర్ 3 సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చాడు సల్లూభాయ్.





Printed, Published and Owned by M.RAMESH, H.No. 87/-569, Ground floor, Madhavanagar, Kurnool City, Kurnool - 518002, Andhrapradesh State, and Printing at PSR Printers, No.87-569, Beside, Chenchureddy Apartment, Madhava nagar,Kurnool - 518002 District, Andhrapradesh, Published from H.No. H.No. 87/-569, Ground floor, Madhavanagar, Kurnool City, Kurnool - 518002, Andhrapradesh, Editor : M.RAMESH, Mob : 8008622746,E-mail : peoplesmotivation22@gmail.com